గురువారం
31-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 71
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

50 ఏళ్లకు జరిగిన న్యాయం

కమ్యూనిస్టు విక్టర్ జారా హంతకులు ఏడుగురికి జైలుశిక్ష

కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు, జానపద గాయకుడు విక్టర్ జారాకు 50ఏళ్ల తర్వాత న్యాయం జరిగింది. 1973లో విక్టర్‌ను హత్య చేసిన నేరానికి ఏడుగురు వృద్ధ మాజీ సైనికులకు చిలీకోర్టు తాజాగా జైలుశిక్ష విధించింది.

2 లో

పాతపింఛను పునరుద్ధరించాలి

- ఎంతటి పోరాటానికైనా సిద్ధం
- సీపీఎస్, జీపీఎస్ వద్దు
- సీఎం జగన్ ఇచ్చిన హామీ నెరవేర్చాలి
- ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరించేంత వరకు తాము ఎంతటి పోరాటానికైనా సిద్ధమవుతామని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పేర్కొంది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్), లేదా

- మిగతా 2 లో

సీఎం విదేశీ అనుమతిపై

ఉత్కంఠ

సీబీఐ కోర్టులో ముగిసిన వాదనలు

తీర్పు నేటికి వాయిదా వేసిన సీబీఐ కోర్టు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బ్రిటన్ పర్యటనకు అనుమతి కోసం ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును సీబీఐ కోర్టు గురువారానికి వాయిదా వేసింది. దీంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠత నెలకొంది. సెప్టెంబరు 2వ తేదీ నుంచి 12 వరకు లండన్‌లోని తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ ఈనెల 28న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దేశం విడిచి వెళ్లరాదన్న బెయిల్ షరతులను సడలించాలని పిటిషన్‌లో కోరారు. జగన్ దాఖలు చేసిన పిటీషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు గత విచారణలో సీబీఐ సమయం కోరింది. దీంతో కోర్టు విచారణను బుధవారానికి వాయిదా వేయగా, సీబీఐ వాదనలు వినిపించింది. జగన్‌కు విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వొద్దని కోరింది. ఆయనపై ఉన్న కేసులను, వాటి తీవ్రతను కోర్టు దృష్టికి సీబీఐ తరపు న్యాయవాది తీసుకొచ్చారు. సీఎం జగన్ తరపు న్యాయవాది అనుమతి ఇవ్వాలని కోరారు. రెండు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును గురువారానికి

- మిగతా 2 లో

ఖరీఫ్ ఖతం!

- సాగు విస్తీర్ణం సగమే
- ఆ పంట కూడా కొన ఊపిరితో...
- తీవ్ర వర్షాభావంతో అల్లాడుతున్న అన్నదాతలు
- రిజర్వాయర్లలో రోజురోజుకీ పడిపోతున్న నీటిమట్టం
- కరువు ముంచుకొస్తున్నా చలనం లేని సర్కారు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈ ఏడాది రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సెప్టెంబరు వస్తున్నా ఇంతవరకు రాష్ట్రంలోని ఏ ఒక్క జిల్లాలోనూ సాధారణ వర్షపాతం కూడా నమోదు కాని పరిస్థితి నెలకొంది. దీంతో ఏటా సాగయ్యే సాధారణ విస్తీర్ణంలో సగ భాగం కూడా సాగుకు నోచుకోలేదు. అడపాదడపా కురిసిన వర్షాలకు, నీటి వనరుల ఆధారంగా వేసిన పంటలు సైతం ఎండ తీవ్రత, విద్యుత్ కోతలు, వర్షాభావ పరిస్థితులు కారణంగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటిలో కూడా పంటను రక్షించుకోవడానికి అయ్యే ఆర్థిక భారాన్ని భరించలేక రైతులు చాలా మంది వదిలేశారు. అక్కడక్కడా మిగిలిన కొద్దిమంది రైతులు మాత్రం ఎండుతున్న పంటను కాపాడుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగం పరిస్థితి దయనీయంగా మారింది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో నీటిమట్టం రోజురోజుకూ పడిపోతుండడంతో సాగునీటి సంగతేమోగానీ, భవిష్యత్తులో తాగునీటికీ కూడా కటకట ఏర్పడే పరిస్థితులు కనపడుతున్నాయి. విచిత్రమేమిటంటే కరువు పరిస్థితులు ముంచుకొస్తున్నా అధికార యంత్రాంగం మాత్రం ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టకపోవడం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. కృష్ణా డెల్టా పరిరక్షణ కోసం గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పట్టిసీమల ఎత్తిపోతల పథకాన్ని రాజకీయ కారణాలతో సకాలంలో వినియోగించుకోలేదు. ముందుగానే గోదావరి నదికి వరదలు వచ్చినప్పటికీ, పులిచింతలలో నీరు నిల్వ ఉందని, వర్షాలు కురుస్తాయని, పాలకులు పట్టిసీమను నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా ఖరీఫ్‌కు ఢోకా లేని కృష్ణా డెల్టా కూడా టైలాండ్ ప్రాంతాలన్నీ ఎడారిగా మారే పరిస్థితి ఉత్పన్నమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ సాగు విస్తీర్ణం సుమారు 86 లక్షల ఎకరాలు కాగా, 48 లక్షల ఎకరాల్లోనే వివిధ రకాల పంటలు సాగు చేశారు. వీటిలో వరి 23 లక్షల 72 వేల ఎకరాల్లో, వేరుశనగ 7 లక్షల ఎకరాల్లో, పత్తి 9 లక్షలు, కంది 2 లక్షల 72

- మిగతా 2 లో

కేంద్రంలో నిరంకుశ

మత విద్వేష పాలన

రాష్ట్రంలో దోపిడీ, దుర్మార్గం, అవినీతి రాజ్యమేలుతోంది

వీటి అంతానికి ప్రజలంతా ఏకంకావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ పార్టీ కూడా ఇంత నిరంకుశంగా, మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పాలన కొనసాగించలేదనీ, రాష్ట్రంలో దోపిడీ, దుర్మార్గాలు అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వానికి ఏకకాలంలో బుద్ధి చెప్పడానికి దేశ ప్రజలంతా ఏకతాటిపై నిలబడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు.

8 లో

'ఇండియా'

భేటీ నేడు

- ముంబైలోని గ్రాండ్ హయాత్ ముస్తాబు
- ఒక్కొక్కరిగా చేరుకుంటున్న కూటమి నాయకులు
- లోగో ఆవిష్కరణ, ఎన్నికల వ్యూహాలు, సీట్ల సర్దుబాటే అజెండా
- కన్వీనర్, అధినేత ఎంపికకు అవకాశం
- పోటీగా ఎన్డీయే సమావేశాలు

2 లో

బీజేపీకి సహకరించే పార్టీలను

వ్యతిరేకిస్తాం

- ఇండియా కూటమితోనే మోదీ పతనం
- ఏపీలో విపక్షాలు ఏకం కావాలి
- సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/దిల్లీ: బీజేపీకి సహకరించే పార్టీలను వ్యతిరేకిస్తామని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ నొక్కిచెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ ప్రజలకు అన్యాయం చేస్తే ఎండగడతామన్నారు. ఇండియా కూటమి రాజకీయ సమ్మేళనం మోదీ ప్రభుత్వ పతనానికి సంకేతమని తెలిపారు. మణిపూర్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రపతిని సీపీఐ నాయకులు కలిశారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి పదవులు లేకున్నా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో డబుల్ ఇంజిన్ పాలన సాగుతోందని విమర్శించారు. మోదీకి ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులు వంత పాడుతున్నారని నారాయణ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో విపక్షాలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. పొత్తులపై ఊగిసలాట తగదని టీడీపీకి హితవు పలికారు. అన్ని విధాలా రాష్ట్రానికి నష్టం చేసిన బీజేపీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించడం తగదని సూచించారు. సీపీఐ, సీపీఎం, జనసేనతో కలిసి కూటమిని ఏర్పాటు చేస్తే బీజేపీ-వైసీపీ డబుల్ ఇంజిన్ ఫెయిల్ అవుతుందన్నారు. నారాయణ బుధవారం దిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జాతీయ, తెలుగు రాష్ట్రాల అంశాలను ప్రస్తావించారు. మోదీ ప్రభుత్వ మతతత్వ, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. మణిపూర్‌లో పరిస్థితులపై రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా నేతృత్వ బృందం కలిసినట్లు నారాయణ తెలిపారు. ఈశాన్య రాష్ట్రంలో హింసాకాండకు కేంద్రంతో పాటు ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వానిదే బాధ్యతన్నారు. మణిపూర్‌లో అడుగడుగునా బారికేడ్లు ఉన్నాయని, 253 మృతదేహాల్ని అక్కడి ప్రభుత్వం ఇంకా గుర్తించలేదన్నారు. మణిపూర్ సీఎంను తొలగించాలని, ప్రధాని మోదీ మణిపూర్‌లో పర్యటించేలా చూడాలని రాష్ట్రపతిని కోరినట్లు చెప్పారు. పార్లమెంట్ ఆమోదించిన అటవీ చట్టానికి సంబంధించిన బిల్లుపై సంతకం చేయొద్దని, దాంతో గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతుందని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేసినట్లు నారాయణ తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీజేపీ ఎన్నికల దృష్ట్యా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరపై రూ.200 తగ్గించిందన్నారు. మోదీకి చిత్తశుద్ధి వుంటే 2014 నాటి గ్యాస్,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సంక్షేమ ఫలాల నిరాకరణకు

అస్త్రంగా ఆధార్

- ఉపాధి హామీ పథకం కింద చెల్లింపులకు ముడి
- సమయానికి అందని కూలీడబ్బులు
- తప్పులతో జాబ్‌కార్డు కోల్పోతున్న కార్మికులు
- డిసెంబరు 31 వరకు డెడ్‌లైన్ పొడిగింపు: కేంద్రం

న్యూదిల్లీ: సామాజిక సంక్షేమ ఫలాలను బలహీన వర్గాలకు నిరాకరించేందుకు ఆధార్‌ను అస్త్రంగా మోదీ ప్రభుత్వం మల్చుకుంది. ఆధార్‌లోని తప్పులు తదితర కారణాలతో జాబ్‌కార్డులు పొగొట్టుకున్న వారి విషయంలో ఏ మాత్రం చిత్తశుద్ధి చూపించడం లేదు.సాంకేతికతో చేసే ప్రయోగాల వల్ల కలిగే నష్టాలకు నిరుపేదలు, అణగారిన, బలహీన వర్గాలు మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోంది. ఆధార్ ఆధారిత చెల్లింపులకు కేంద్రం పెద్ద పీట వేస్తుండటంతో గ్రామీణ ఉపాధి హామీ లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోంది. అయితే ఈ పథకం కింద మిశ్రమ పద్ధతుల్లో చెల్లింపులకు గడువును డిసెంబరు 31 వరకు కేంద్రప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ బుధవారం ప్రకటన చేసింది. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి

- మిగతా 2 లో

స్మైల్ ప్లీజ్..

- చంద్రయాన్-3 ల్యాండర్ ఫొటో తీసిన రోవర్
- ముగిసిన ఆదిత్య ఎల్1 రిహార్సల్స్ : ఇస్రో

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చంద్రుడు, సూర్యుడిపై మిషన్లను చేపడుతోంది. చంద్రయాన్-3 దిగ్విజయంగా జాబిల్లి అవతల పక్కకు చేరుకోవడం, ప్రయోగాలు సజావుగా జరుగుతుండటం, దినదిన పురోగతి కనిపిస్తుండటంతో ఇస్రో సంతృప్తిగా ఉంది. చంద్రయాన్-3 ల్యాండర్ విక్రమ్, రోవర్ ప్రజ్ఞాన్ అప్‌డేట్స్‌ను ఏ రోజుకు ఆ రోజు సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంటోంది. బుధవారం ఉదయం ల్యాండర్ విక్రమ్ ఫొటోలను రోవర్ ప్రజ్ఞాన్ తీసినట్లు ఇస్రో తెలిపింది. ఆ ఫొటోలను 'స్మైల్ ప్లీజ్' అన్న క్యాప్షన్‌తో సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. రోవర్‌కు అమర్చిన నేవిగేషన్ కెమెరాలు ఈ ఫొటోలు తీసినట్లు ఇస్రో పేర్కొంది. ఈ కెమెరాలను

- మిగతా 2 లో

చిలీ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు గ్యుల్లెర్మో టెల్లియర్ కన్నుమూత

శాంటియాగో: చిలీ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు గ్యుల్లెర్మో టెల్లియర్ (79) కన్నుమూశారు. మంగళవారం తెల్లవారుజామున చిలీ యూనివర్సిటీ క్లినికల్ హాస్పిటల్‌లో ఆయన తుది శ్వాస విడిచారు. గతేడాది కాలంగా కోవిడ్‌తో ముడిపడి ఉన్న అనేక ఆరోగ్యపరమైన సమస్యలతో ఆయన బాధపడ్డారు. టెల్లియర్ మరణించినట్లు చిలీ కమ్యూనిస్టు పార్టీ అధికారికంగా ప్రకటించింది. పాపులర్ యూనిటీకి మనస్ఫూర్తిగా మద్దతిచ్చిన నాయకుడిని కోల్పోయామని పేర్కొంది. నియంత పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని శ్లాఘించింది. గ్యుల్లెర్మో టెల్లియర్ లేని లోటు భర్తీ చేయలేనిదిగా చిలీ అధ్యక్షులు గేబ్రియల్ బోరిక్ అన్నారు. చరిత్ర కలిగిన కమ్యూనిస్టు నాయకుడని, తరాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. టెల్లియర్ చిలీకి తన జీవితాన్ని అంకితం చేశారని, నిస్వార్థ సేవలు అందించారని కొనియాడారు. ఆయనకు నివాళిగా సంతాప దినాలను బోరిక్ ప్రకటించారు. 1950 నుంచి నిబద్ధతగల కమ్యూనిస్టుగా టెల్లియర్ పేరుగాంచారు. పీసీ కేంద్ర కమిటీలో 1988 నుంచి ఉన్నారు. 2005 మార్చి నుంచి పార్టీకి నాయకత్వం వహించారు. 1973, సెప్టెంబరు 11న జనరల్ ఆగస్టో పినోచెట్ నేతృత్వంలో తిరుగుబాటు జరిగినప్పుడు దాదాపు ఏడాది పాటు అజ్ఞాతవాసంలో టెల్లియర్ గడిపారు. అనంతరం ఆయనను ఎయిర్‌ఫోర్స్ వార్ అకాడమీకి తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేశారు.

విశాలాంధ్ర ప్రపంచం

వేదనభరిత రెండేళ్ల కారావాసాన్ని అనుభవించిన ఆయన 1976లో జైలు నుంచి విడుదలయ్యారు. 1980వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ సైనిక కమిషన్ అధిపతిగా బాధ్యతలు చేపట్టారు. 2010లో శాంటియాగో మెట్రోపాలిటన్ ప్రాంతానికి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత వరుసగా మూడుసార్లు (2022 మార్చి వరకు) ఎన్నికయ్యారు.

బ్రిక్స్‌కు పెరిగిన బలం, ప్రాధాన్యత

'ఆఫ్రికా'కు ఆర్థిక వృద్ధి సాధించే అవకాశమివ్వాలి : లూలా



బ్రసీలియా: బ్రిక్స్ కూటమి విస్తరణతో దాని బలం, ప్రాధాన్యత పెరిగినట్లు బ్రెజిల్ అధ్యక్షుడు లులా డా సిల్వా అన్నారు. ప్రతి వారం అధ్యక్షుడితో మాటామంతీ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ దక్షిణాఫ్రికా, జొహనెస్‌బర్గ్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు గురించి ప్రస్తావించారు. మరిన్ని ఆర్థిక వ్యవస్థలు ఈ కూటమిలో చేరుతుండాన్ని స్వాగతించారు. బ్రిక్స్ విస్తరణతో ఆర్థికచర్చల్లో ప్రపంచం తీరు మారుతుందని ఆకాంక్షించారు. సభ్య దేశాల మధ్య సులభతర వాణిజ్యం కోసం ఉమ్మడి కరెన్సీ రావాలని, తద్వార డాలర్‌పై ఆధారాన్ని తగ్గించుకోవచ్చని అన్నారు. ఎగుమతుల కోసం రిఫరెన్స్ కరెన్సీని ఏర్పాటు చేసుకుందామని లూలా సూచించారు. ఇది డాలర్‌కు వ్యతిరేకంగా కాదు బ్రెజిల్ ఆర్థిక వ్యవస్థకు ఆధారం కోసమేనని ఆయన స్పష్టతిచ్చారు. వచ్చే ఏడాది జనవరి నుంచి సౌదీ అరేబియా, ఈజిప్టు, యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, ఇరాన్ దేశాలు బ్రిక్స్ సభ్యదేశాలుగా ఉంటాయి. ఇదిలావుంటే, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)కు భారీగా రుణపడి ఉండటంతో వడ్డీలు కట్టుకోవడమే ఆఫ్రికా దేశాలకు సరిపోతోందని, వాటికి ఆర్థిక వృద్ధిని సాధించేందుకు ఓ అవకాశాన్ని సంపన్న దేశాలు ఇవ్వాలని లాలూ అన్నారు. అందుకోసం ఐఎంఎఫ్‌కు ఆఫ్రికా రుణాలను ఆ దేశాల్లో మౌలిక వసతుల పనిగా మార్చాలని ప్రతిపాదించారు. ప్రస్తుతానికి ఆఫ్రికా దేశాల అప్పు 800 బిలియన్ డాలర్లను అధిగమించింది. వచ్చే ఆదాయం వడ్డీల చెల్లింపులకే సరిపోతోంది. ఆఫ్రికాలో పేదరికం ఎక్కువని, అక్కడి దేశాలు ఐఎంఎఫ్‌కు భారీగా రుణపడి ఉన్నాయని, వడ్డీలు కట్టుకోవడానికే సంపద సరిపోతుండటంతో పెట్టుబడులు పెట్టే పరిస్థితి ఉండటం లేదని లూలా తెలిపారు. ఆర్థిక వృద్ధి సామర్థ్యం ఆఫ్రికా దేశాలకు ఉందని, భారీ రుణభారం వల్ల తమకున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నాయని చెప్పారు. అందుకోసమే ఐఎంఎఫ్‌కు ఆఫ్రికా రుణాలను మౌలిక వసతుల పనులుగా మార్చాలని, తద్వార వృద్ధి చెందేందుకు అవకాశాన్ని ఆ దేశాలకు ఇవ్వాలని సంపన్న దేశాలకు తాను ప్రతిపాదిస్తున్నట్లు లూలా తెలిపారు.

పాతపింఛను పునరుద్ధరించాలి

(మొదటిపేజీ తరువాయి)

గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)కు తాము అంగీకరించబోమని పునరుద్ఘాటించింది. విజయవాడ ఎస్టీయూ -ఏపీ కార్యాలయంలో బుధవారం నాలుగు ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు విలేకరుల సమావేశం నిర్వహించాయి. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎల్ సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్, ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ హృదయ రాజు, ఎస్ చిరంజీవి, ఆప్టా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీ గణపతిరావు, కే ప్రకాశరావు మాట్లాడారు. జీపీఎస్ పై ఈనెల 29వ తేదీన మంత్రివర్గ ఉప సంఘం, ఉద్యోగ సంఘాలతో నిర్వహించిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేనందున ఉద్యోగుల ఆశలు ఆవిరి అయ్యాయన్నారు. సీపీఎస్ ఉద్యోగులను ఈ ప్రభుత్వం నిలువునా ముంచేసిందని ఉపాధ్యాయ సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. జీపీఎస్ విధానాలు ఏమిటో చెప్పకుండా, కేవలం 50 శాతం పెన్షన్, దానిపై ఇచ్చే డియర్ నెస్ రిలీఫ్ చుట్టూనే మొత్తం చర్చ నడిపారన్నారు. ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం వారికి ఇవ్వాల్సిన 60 శాతం పెన్షన్ ఫండ్ ను చెల్లించకుండా, దానినే మదుపు చేసి 50 శాతం పెన్షన్ ఇస్తామని చెప్పడం ద్వారా జీపీఎస్ ముసుగును ప్రభుత్వం తొలగించిందన్నారు. జీపీఎస్ విధానం సీపీఎస్ కు ప్రతిరూపమే తప్ప, వేరేమీ కాదని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్న మాటలు మరోసారి రుజువయ్యాయని తెలిపారు. ఇటీవల రోసా రూల్స్, రాష్ట్రపతి ఉత్తర్వులు 2023పై నిర్ణయాలు చేసేటప్పుడు ముసాయిదా ఇచ్చి... దానిని అధ్యయనం చేయడానికి కొంత సమయం ఇచ్చి... ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాల్ని ప్రభుత్వం తీసుకుందని గుర్తు చేశారు. జీపీఎస్ పై ఆర్డినెన్స్‌కు వెళ్తూ కనీసం ముసాయిదా కూడా ఇవ్వకుండా అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్రప్రభుత్వ ఆదేశాల ప్రకారం 2004కు ముందు నియామకపు ప్రక్రియ పూర్తయిన 11వేలమందికి పాత పెన్షన్ విధానం అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. జీపీఎస్ విధానమే అంత గొప్పదైతే, ఉద్యోగులకు మేలు కలిగించేదైతే, దేశానికంతటికీ ఆదర్శవంతమైనదైతే... ప్రభుత్వం ఎందుకు ముసాయిదా విడుదల చేసి దానిపై చర్చించడం లేదని సూటిగా ప్రశ్నించారు. ఉద్యోగుల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని, ఇచ్చిన హామీకి కట్టుబడి... పాతపెన్షన్ విధానాన్ని అమలు చేసి సీఎం జగన్ తన విశ్వసనీయతను ఎందుకు నిరూపించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రకటిస్తున్న ఈ గ్యారంటీ పెన్షన్ స్కీమ్ కు గ్యారంటీ ఏమిటని ప్రశ్నించారు. కొన్ని ఉద్యోగ సంఘాల నేతల వైఖరి తగదని, వారు సీపీఎస్ ఉద్యోగుల ఆవేదన గమనించకుండా ప్రభుత్వానికి వంతపాడటంతోపాటు ఓపీఎస్ కోసం చిత్తశుద్ధితో పోరాడుతున్న ఉపాధ్యాయ సంఘాలపై బురద చల్లడం సబబు కాదని సూచించారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ కోసం జరిగే పోరాటంలో అందరూ కలిసి రావాలన్నారు. రాష్ట్రంలో ఉన్న మూడు లక్షలమంది సీపీఎస్ ఉద్యోగులంతా పాత పెన్షన్ విధానాన్నే కోరుతున్నారని స్పష్టం చేశారు. తక్షణమే సీపీఎస్‌ను రద్దు చేసి... పాత పెన్షన్ విధానం అమలు చేయాలనేదే తమ డిమాండని, అందుకోసం ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని నాలుగు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.

50 ఏళ్లకు జరిగిన న్యాయం

కమ్యూనిస్టు విక్టర్ జారా హంతకులు ఏడుగురికి జైలుశిక్ష

శాంటియాగో: కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు, జానపద గాయకుడు విక్టర్ జారాకు 50ఏళ్ల తర్వాత న్యాయం జరిగింది. 1973లో విక్టర్‌ను హత్య చేసిన నేరానికి ఏడుగురు వృద్ధ మాజీ సైనికులకు చిలీకోర్టు తాజాగా జైలుశిక్ష విధించింది. నియంత అగస్టో పినోచెట్ నాయకత్వంలో తిరుగుబాటు పర్యవసానంగా విక్టర్ జారా హత్య జరిగింది. శిక్ష పడిన మాజీ సైనికుల వయస్సు 73 నుంచి 85 ఏళ్ల వరకు ఉంటుంది. ఎనిమిదేళ్ల నుంచి 25 ఏళ్ల వరకు శిక్ష విధిస్తూ చిలీ కోర్టు తీర్పు వెలువరించింది. విక్టర్ జారా (40) 1973, సెప్టెంబరు 11న అరెస్టు అయ్యారు. సీఐఏ అండతో జరిగిన తిరుగుబాటు వల్ల సోషలిస్టు అధ్యక్షుడు శాల్వడార్ అల్లెండె ప్రభుత్వం కూలిపోయింది. విక్టర్ జారాను మరో ఐదు వేల మంది రాజకీయ ఖైదీలతో పాటు క్రీడా మైదానంలో బంధించి ఉంచారు. చిత్రహింసలకు గురిచేశారు. చివరకు చంపేశారు. 44 బుల్లెట్లు తునాతునకలు చేసిన ఆయన మృతదేహం చాలా రోజులకు లభ్యమైంది. ఆయన ఓ గాయకుడు, గిటారిస్టు. విక్టర్ జారా చేతి వేళ్లను రైఫిళ్ల వెనుక భాగంతో కొట్టి, బూట్లతో నలిపి విరిచివేయడం అమానవీయం, భయానకం. విక్టర్ జారా... చిలీ కమ్యూనిస్టు పార్టీ సభ్యులు. పాపులర్ యూనిటీ సంకీర్ణానికి, అధ్యక్షుడు అల్లెండెకు మద్దతుదారుడు. ప్రజాదరణతో అల్లెండె 1970లో అధ్యక్ష పీఠాన్ని అధీష్టించారు.

'ఇండియా' భేటీ నేడు

ముంబై: దేశంలోని నిరంకుశ ప్రభుత్వాన్ని గద్దె దించి ప్రజలకు లౌకిక పాలన అందించే లక్ష్యంతో ఐక్య కార్యాచరణతో ఇండియా కూటమి ముందుకెళుతోంది. కలిసి వచ్చే పార్టీలతో మమేకమవుతూ బలాన్ని పెంచుకుంటోంది. ఎన్డీయే మిత్రపక్షాల్లో కొన్ని, ఈశాన్య రాష్ట్రాల నుంచి మరికొన్ని పార్టీలు ఇండియా కూటమిలో చేరబోతున్నట్లు సంకేతాలు ఉన్నాయి. దీంతో గురు, శుక్రవారాల్లో దేశ ఆర్థిక రాజధాని ముంబై వేదికగా జరగబోయే ఇండియా కూటమి మూడో సమావేశం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఎన్నికల వ్యూహాలు, సీట్ల సర్దుబాటు వంటివి ప్రధానంగా చర్చకు రానున్నట్లు తెలుస్తోంది. మొదటిసారి బీహార్ రాజధాని పాట్నాలో, రెండవసారి కర్నాటక రాజధాని బెంగళూరులో ఇండియా కూటమి భేటీ అయింది. ఇప్పుడు మూడోసారి కూటమిలోని పార్టీలేవీ అధికారంలో లేని మహారాష్ట్రలో తాజా భేటీ జరగనుండటం ఆసక్తికరంగా మారింది. అయితే ముంబైలోని గ్రాండ్ హయాత్ హోటల్‌లో ఈ సమావేశాలకు భారీగా ఏర్పాట్లు జరిగాయి. 200కుపైగా గదులను సిద్ధం చేశారు. అన్ని ఏర్పాట్లను శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్‌సీపీ పార్టీలు సంయుక్తంగా చేపట్టాయి. 28 రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనున్నారు.

బెంగళూరు సభలో కూటమి పేరు ప్రకటించగా ముంబై వేదికగా లోగో ఆవిష్కరించనున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు ఎన్డీయేతో కలిసివున్న కొన్ని పార్టీలు, ప్రత్యేకించి ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు ఇండియా కూటమిలో చేరబోతున్నట్లు సమాచారం ఉండటంతో ముంబై భేటీపై అంచనాలు మరింతగా పెరిగాయి. అదే సమయంలో సమన్వయ కమిటీల ఏర్పాటు, ఎన్నికల వ్యూహాలు, కూటమి అధినేత ఎన్నికల వంటి అంశాలపై చర్చ జరుగుతుందని తెలిసింది. కన్వీనర్ పదవికి బీహార్ సీఎం నితీశ్ కుమార్ పేరు వినిపిస్తుండగా, కూటమి అధినేతగా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ పేరు పరిశీలనలో ఉందని సమాచారం. 'బీజేపీ వెళ్లిపో' అన్నది కూటమి నినాదం కావచ్చని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇదిలావుంటే ఇండియా కూటమికి దీటుగా సమావేశాలు నిర్వహించేందుకు ఎన్డీయే నడుం బిగించింది. విపక్ష కూటమి భేటీ అయ్యే రోజుల్లోనే ఎన్డీయే పక్షాలు సమావేశం కాబోతున్నాయి. ఈనెల 31న మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నివాసంలో రాత్రికి విందు ఏర్పాటు చేయగా సెప్టెంబరు ఒకటో తేదీన వేర్వేరు రాష్ట్రాల కోసం వ్యూహాలపై చర్చించేందుకు అనేక సెషన్లను మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది.

'ఇండియా'నే ప్రత్యామ్నాయం: శరద్ పవార్

ఇండియా కూటమియే ప్రత్యామ్నాయమని, దీనితోనే రాజకీయ మార్పు సాధ్యమని ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ నొక్కిచెప్పారు. ముంబై సమావేశంలో 28 పార్టీల నుంచి 63 మంది ప్రతినిధులు పాల్గొంటారని పవార్ తెలిపారు. ఇప్పటివరకు సీట్ల సర్దుబాటుపై చర్చలు జరగలేదన్నారు. ఎన్‌సీపీ విషయంలో ఎలాంటి సందేహాలు లేవన్నారు. ముంబైలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పవార్ మాట్లాడుతూ బీఎస్పీ అధినేత్రి మాయవతి ఎవరి పక్షమన్నది ప్రశ్నార్థకమని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఆమెది ఎన్డీయే పక్షమన్న సంకేతాలు ఉన్నాయని, దీనిపై స్పష్టత రావాల్సి ఉందని చెప్పారు. ఇంతకుముందు ఆమె బీజేపీతో చర్చలు జరిపారన్నారు. మరోవైపు తాము ఎవరికి మద్దతివ్వమని మాయావతి ట్వీట్లలో వెల్లడించారు.

మాకు సమర్థుల కొరత లేదు: ఉద్ధవ్

ప్రధానమంత్రిగా సమర్థులైన వారు ఇండియా కూటమిలో అనేక మంది ఉన్నారు కానీ బీజేపీకి ఉన్నది ఒక్కరే అని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే వ్యాఖ్యానించారు. ఇండియా కూటమి మూడో సమావేశానికి ముస్తాబైన గ్రాండ్ హయాత్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉద్ధవ్ మాట్లాడుతూ రాఖీ సందర్భంగా ఎల్పీజీ సిలిండర్‌పై రూ.200 తగ్గిస్తున్నట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించడాన్ని దుయ్యబట్టారు. 'తొమ్మిదేళ్లలో రాఖీ పండగ రాలేదా? ఇండియా కూటమి పురోగమించే క్రమంలో ఎల్పీజీ సిలిండర్ల ఉచిత పంపిణీ జరగవచ్చు. వారు (బీజేపీ) ఏం చేసినా నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు. ప్రజలు విజ్ఞులు, అన్ని విషయాలను అర్థం చేసుకోగలరు' అని ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం (ఎంఎంఆర్) ఆర్థిక సంస్కరణ కోసం నీతి ఆయోగ్ మాస్టర్‌ప్లాన్ గురించి ప్రశ్నకు కేంద్రం జోక్యం చేసుకునే ఎలాంటి ప్రణాళికనైనా వ్యతిరేకిస్తామని బదులిచ్చారు. ఇండియా కూటమికి కన్వీనర్ ఎవరన్న ప్రశ్నకు చర్చలు జరపనివ్వండి చూద్దాం అన్న సమాధానాన్ని ఇచ్చారు. ఎన్డీయేకి కన్వీనర్ ఎవరో ఎవరికైనా తెలుసా అంటూ పాలకపక్షాన్ని ఉద్ధవ్ ఠాక్రే విమర్శించారు.

ముంబై చేరుకున్న మమత, లాలూ

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం ముంబై చేరుకున్నారు. ముంబై విమానాశ్రయంలో శివసేన (యూబీటీ) నేత ఆదిత్యఠాక్రే, మహావికాస్ అగాడీ పార్టీల నేతలు ఆమెకు స్వాగతం పలికారు. అటు ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్, బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ మంగళవారం సాయంత్రమే ముంబై చేరుకున్నారు.

ముందస్తుకూ సిద్ధమే: అఖిలేశ్

రాబోయే ఎన్నికల్లో ఇండియా కూటమి చేతిలో బీజేపీ చిత్తు అవుతుందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ దీమాగా చెప్పారు. ఏ సమయంలో ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు తన పార్టీ, మిత్రపక్షాలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ముందస్తు భయం లేదన్నారు. దేశం కోరుకుంటున్న మార్పు ఇండియా కూటమితోనే సాధ్యమన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలపై రైతులు, యువత, కార్మికులు, పేదలు కోపంగా ఉన్నారని చెప్పారు. రూ.400 విలువ చేసే గ్యాస్ సిలిండర్లను రూ.1,100కు విక్రయిస్తూ, ఇప్పుడు రూ.200 తగ్గించి ఏదో ఘనకార్యం చేసినట్లు జబ్బలు చెర్చుకుంటున్నారని కేంద్రాన్ని ఎద్దేవా చేశారు. కేపిటలిస్టులకు ఊడిగం చేస్తూ ప్రజలను వెన్నుపోటు పొడిచే పనిలో పాలకులు ఉన్నారని అఖిలేశ్ విమర్శించారు.

అధీర్ రంజన్ సస్పెన్షన్ రద్దు

సభాహక్కుల కమిటీ ఏకగ్రీవ తీర్మానం

న్యూదిల్లీ: కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరిపై సస్పెన్షన్‌ను రద్దు చేయాలన్న తీర్మానాన్ని లోక్‌సభ హక్కుల కమిటీ బుధవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాల చివరిరోజు (ఆగస్టు 11)న లోక్‌సభలో చౌదరి చేసిన కొన్ని వ్యాఖ్యలు ఆయనపై సస్పెన్షన్ వేటుకు దారితీశాయి. అయితే తాను చేసిన వ్యాఖ్యలకు చింతన వ్యక్తం చేస్తూ హక్కుల కమిటీని చౌదరి ఆశ్రయించగా ఆయన సస్పెన్షన్ రద్దునకు చేసిన తీర్మానానికి కమిటీ ఆమోదం లభించింది. ఎవరి మనోభావాలను దెబ్బతీయడం తన ఉద్దేశం కాదని బీజేపీ సభ్యుడు సునీల్ కుమార్ సింగ్ నేతృత్వ కమిటీకి చౌదరి వివరణ ఇచ్చారు. అధిర్ రంజన్ చౌదరి సస్పెన్షన్ రద్దుపై తీర్మానానికి కమిటీ ఆమోదం లభించడంతో దానిని స్పీకర్ పరిశీలనకు పంపనున్నట్లు కమిటీ సభ్యుడు ఒకరు తెలిపారు. ఈనెల 18న జరిగిన సమావేశంలో చౌదరిని శిక్షించాలన్న అభిప్రాయాన్ని కమిటీ సభ్యుల్లో చాలామంది వ్యక్తంచేశారు. ఈ వ్యవహారంలో పార్లమెంటరీ ప్యానల్ పరిశీలన అక్కర్లేదన్నారు. అయితే న్యాయ ప్రక్రియలో భాగంగా బుధవారం తమ ఎదుట హాజరు కావాలని చౌదరికి కమిటీ సూచించింది.



అస్త్రంగా ఆధార్

(మొదటిపేజీ తరువాయి)

హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ ద్వారా కార్మికులకు తప్పనిసరి కూలి కోసం డెడ్‌లైన్‌ను డిసెంబరు 31వ లేదా తదుపరి ఆదేశాల వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఏబీపీఎస్) సమీక్ష అనంతరం ఎన్‌ఏసీహెచ్, ఏబీపీఎస్ ద్వారా వేతనాల చెల్లింపుల గడువును పొడిగించాలని నిర్ణయించినట్లు తెలిపింది. పనికి వచ్చే లబ్ధిదారులు తప్పనిసరిగా తమ ఆధార్‌ను నమోదు చేసుకోవాలి, పని డిమాండ్‌కు ఏపీబీఎస్ కింద చెల్లింపులకు ఆమె/ అతను అర్హతతో సంబంధం ఉండదని వెల్లడించింది. ఏపీబీఎస్ కోసం అనర్హులన్నా కారణంగా జాబ్ కార్డులను తొలగించలేరని మంత్రిత్వశాఖ తెలిపింది. మొత్తం 14.33 కోట్ల మంది క్రియాశీల లబ్ధిదారులు ఉండగా 13.97 కోట్ల మంది ఆధార్ నమోదు చేయగా వీరిలో 13.34 కోట్ల మంది ఆధార్‌ల ధ్రువీకరణ జరిగినట్లు వెల్లడించింది. లబ్ధిదారుల్లో 81.89శాతం మంది ఏపీబీఎస్ చెల్లింపులకు అర్హులని, జులైలో సుమారు 88.51శాతం మందికి కూలి చెల్లించినట్లు పేర్కొంది. ఏబీపీఎస్ కింద అర్హతగల 98శాతానికిపైగా వర్కర్లతో కేరళలో అగ్రస్థానంలో ఉంటే తర్వాత స్థానాల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, త్రిపుర రాష్ట్రాలు ఉన్నాయి. కేవలం మూడుశాతం మంది వర్కర్లతో మేఘాలయ చివరి స్థానంలో ఉంది. నాగాలాండ్‌లో 20.8శాతం, అసోంలో 39.3శాతం, లక్షద్వీప్‌లో 60.8శాతం, అరుణాచల్ ప్రదేశ్‌లో 62.7శాతం మంది ఏబీపీఎస్ అర్హులున్నారు.

అయితే మోదీ ప్రభుత్వం సాంకేతికతో చేసే ప్రయోగాల వల్ల కలిగే నష్టాలకు నిరుపేదలు, అణగారిన, బలహీన వర్గాలు భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోందని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ వర్కర్లకు తక్షణమే చెల్లింపులలో కేంద్రప్రభుత్వం తాత్సారం చేస్తోందని విమర్శించింది. సామాజిక సంక్షేమ ప్రయోజనాలను సులభతరంగా పొందేందుకు వీలుగా ఉండటానికి ఆధార్‌ను యూపీఏ ప్రభుత్వం తీసుకు రాగా దానిని పౌరులకు హామీ ఇచ్చిన హక్కులను నిరాకరించే అస్త్రంగా మోదీ ప్రభుత్వం మల్చిందని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఇలాంటివి వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెండింగ్ ఎంజీఎన్ఆర్ఈజీఏ చెల్లింపులు తక్షణమే జరపాలన్నారు. బహిరంగ మస్టర్ జాబితాలు, సామాజిక ఆడిట్ల ద్వారా పారదర్శకతను మెరుగుపర్చాలని సూచించారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనుండటం, ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుండటంతో సాంకేతికపరమైన ప్రయోగాలతో అనివార్య పరిణామాన్ని కొద్దికాలం వాయిదా వేయాలని ప్రభుత్వం భావిస్తోందని వ్యాఖ్యానించారు. తాజాగా చెల్లింపులకు సంబంధించిన గడువు పొడిగించడం ఐదోసారి కాగా ఇప్పటికీ 26 కోట్ల జాబ్ కార్డుదారుల్లో 41.1శాతం మంది ఈ పద్ధతిలో చెల్లింపులకు అనర్హులుగా ఉన్నారన్నారు. నాల్గో పొడిగింపు ఈనెల 31వ తేదీతో ముగియనుంది. ఆ తర్వాత గడువును పొడిగించమని, 18.3శాతం మంది అనర్హులవుతారని కేంద్రం తొలుత పేర్కొంది కానీ ఐదోసారి డెడ్‌లైన్‌ను పొడిగించింది. దీనిపై జైరాం రమేశ్ స్పందిస్తూ 'ఎంఎన్ఆర్ఈజీఏపై ప్రధాని అయిష్టత అందరికీ తెలుసు. కోవిడ్ సమయంలో బలవంతంగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌ను ప్రభుత్వం కొనసాగించింది. ప్రస్తుత గ్రామీణ సంక్షోభంతో ఎంజీఎన్ఆర్ఈజీఏ కింద పనిని కార్మికుల్లో చాలామంది డిమాండ్ చేశారు' అని అన్నారు. పనిని డిమాండ్ చేసే వారందకీ జీతాలివ్వాలన్న చట్టబద్ధ బాధ్యత నుంచి తప్పించుకునేందుకు పారదర్శకత, సామర్థ్యం మెరుగుదల నెపంతో కూలీలకు పనిని, జీతాన్ని పదేపదే తిరస్కరిస్తోందని కేంద్రప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ప్రభుత్వ అంచనా ప్రకారం 2.6కోట్ల మందికిపైగా క్రియాశీల కార్మికులకు చట్టబద్ధ వేతనాలు చెల్లించలేదని తెలుస్తోందన్నారు. వివిధ లోపాలు, తప్పుల వల్ల జాబ్ కార్డులు పోగొట్టుకున్న వారి సంఖ్య కోట్లల్లో ఉండగా చెల్లింపులు అందని వారి జాబితాలో ఈ కార్మికుల లెక్కలేదని చెప్పారు. ఆధార్ అనుబంధ తప్పులతో అనేక చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని, తీవ్ర జాప్యాన్ని మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ కబుర్లు చెబుతోందని విమర్శించారు. తక్షణమే చెల్లింపులను చేపట్టాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు.

సీఎం విదేశీ అనుమతిపై ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

వాయిదా వేసింది. మరోవైపు వివిధ దేశాల్లోని విశ్వవిద్యాలయాలతో ఉన్నత విద్యపై ఏపీ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకునేందుకు విదేశీ పర్యటనకు అనుమతి కోరుతూ సీబీఐ కోర్టులో వైసీపీ పార్లమెంటరీ నేత విజయసాయిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా వాదనలు ముగిశాయి. బ్రిటన్, అమెరికా, జర్మనీ, దుబాయ్, సింగపూర్ పర్యటనకు అనుమతి ఇవ్వాలని విజయసాయిరెడ్డి తరపు న్యాయవాది కోరారు. విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు చేపడుతోందని, దీనిలో భాగంగానే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన విశ్వవిద్యాలయాలతో ప్రభుత్వ ఒప్పందాల కోసం విదేశాలకు వెళ్లాల్సి ఉందని తెలిపారు. దీనిపై కూడా రెండు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పు 31వ తేదీకి వాయిదా వేసింది.

స్మైల్ ప్లీజ్..

(మొదటిపేజీ తరువాయి)

ఎలక్ట్రో-ఆప్టిక్స్ సిస్టమ్స్ (ఎల్ఈఓఎస్) అభివృద్ధి చేసినట్లు తెలిపింది. నేవిగేషన్ కెమెరా (నవ్‌కామ్) తీసినది 'ఇమేజ్ ఆఫ్ ది మిషన్' అని ఇస్రో పేర్కొంది. మరోవైపు సూర్యుడిపై పరిశోధనల కోసం ఆదిత్య ఎల్-1 మిషన్‌పై దృష్టిని కేంద్రీకరించింది. ఆదిత్య ఎల్-1 ప్రయోగానికి రిహార్సల్స్, రాకెట్ అంతర్గత తనిఖీలను బుధవారం పూర్తి చేసినట్లు ఇస్రో వెల్లడించింది. ఆదిత్య ఎల్-1 సెప్టెంబరు 2వ తేదీ ఉదయం 11.50గంటలకు ఆంధ్రప్రదేశ్, శ్రీహరికోటలోని ప్రయోగ కేంద్రం నుంచి పీఎస్ఎల్‌వీ-సీ 57 రాకెట్ ద్వారా నింగిలోకి దూసుకెళ్లబోతోంది. ఈ ప్రయోగానికి ఏర్పాట్లు పురోగమిస్తున్నట్లు ఇస్రో వెల్లడించింది. భూమికి 1.5 మిలియన్ కిమీల దూరంలో ఉన్న లాగ్రేరియన్ పాయింట్ (ఎల్1) వద్ద సూర్యుడిపై వాతావరణం, వాయువును పరిశీలించేందుకు ఈ వ్యోమనౌక రూపొందింది. అయితే ఇస్రో చేపట్టబోయే తొలి సౌర మిషన్ ఇదే కావడం విశేషం.

ఖరీఫ్ ఖతం!

(మొదటిపేజీ తరువాయి)

వేలు, మినుము, పెసర 30 వేలు, ఉలవ 2 వేల ఎకరాల్లో సాగు చేశారు. కేవలం ఆరుతడి వర్షాలతో సాగయ్యే పత్తి పంట సైతం 16 లక్షల సాధారణ విస్తీర్ణానికిగాను కేవలం 60 శాతం మేర 7 లక్షల ఎకరాల్లోనే సాగైంది. ఇప్పుడు ఈ పంట పరిస్థితి కూడా ప్రశ్నార్థకంగా మారింది. నెలల తరబడి వర్షాలు కురవకపోవడంతో ఈ పంటను రక్షించుకోవడానికి రైతు పడుతున్న కష్టం వర్ణనాతీతంగా ఉంది. అసలే అత్యధిక పెట్టుబడులతో కూడిన వాణిజ్య పంటల్లో పత్తి ఒకటి. అటువంటి పంట పూత దశకు చేరుకుంటున్న తరుణంలో మొక్కను బతికించుకోవడానికి రైతు తన సర్వశక్తులూ ఒడ్డుతూ అప్పుల పాలవుతున్నాడు. ఆయిల్ ఇంజన్లు పెట్టి కిలోమీటర్ల పొడవునా పైపులు వేసి, ఆ సౌకర్యం కూడా లేకపోతే నీటి ట్యాంకర్లను వినియోగిస్తూ తలకుమించిన ఆర్థిక భారానికి గురవుతున్నారు. గోరుచుట్టుపై రోకటిపోటులా ఇటువంటి వర్షాభావ పరిస్థితుల్లో అధికారులు విధిస్తున్న అప్రకటిత విద్యుత్ కోతలు కూడా రైతుకి శాపంగా పరిణమించాయి. దాదాపు 11 జిల్లాల్లో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాని దుస్థితి నెలకొంది. ఎన్టీఆర్, నంద్యాల, కాకినాడ జిల్లాలో మైనస్ 25 శాతం వర్షపాతం ఉందంటే పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో అర్థమవుతుంది. అనంతపురం, ప్రకాశం, పల్నాడు, పశ్చిమగోదావరి, శ్రీ సత్యసాయి, అంబేద్కర్ కోనసీమ, కడప, నెల్లూరు, అన్నమయ్య జిల్లాలన్నింటిలో సాధారణ వర్షపాతంలో సగం కూడా నమోదు కాలేదు. మరోపక్క శ్రీశైలం, నాగార్జునసాగర్, తుంగభద్ర, పులిచింతల రిజర్వాయర్లలో నీటి మట్టం రోజురోజుకూ తగ్గిపోతోంది. ఇప్పటికే అన్ని ప్రాజెక్టుల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయగా, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎండ తీవ్రత కొనసాగితే రాబోయే రోజుల్లో తాగునీటికి కూడా కటకట ఏర్పడే పరిస్థితి నెలకొంటుందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్లన్నీ 50 శాతం లోపు నీటి నిల్వలతోనే ఉన్నాయి. కనీసం కర్నాటక రాష్ట్రంలో వర్షాలు కురిసినా శ్రీశైలం ప్రాజెక్టుకు వరద వస్తుందని ఆశపడుతున్నారు. ఆల్‌మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు ఇప్పటికే నిండి ఉండడంతో వాటికి ఏమాత్రం వరద వచ్చినా దిగువకే వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కానీ కర్నాటకలో కూడా వర్షాలు లేకపోవడంతో ఈ ఏడాది కృష్ణా రిజర్వాయర్లకు అసలు వరద వస్తుందా? లేదా? అని అధికారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వర్షాలు లేని కారణంగా పశువులు కూడా మేత, నీటికి ఇబ్బందిపడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కనుచూపుమేరలో పచ్చగడ్డి కానరావడం లేదు. దీంతో ఎండుగడ్డికి గిరాకీ బాగా పెరిగింది. కొందరు పశు యజమానులు ఇంటి వద్దే ఎండు గడ్డి వేసి మేపుతున్నారు. కరువు పరిస్థితులు తాండవిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేసి, వర్షాభావ పరిస్థితులను తట్టుకునే పంటల సాగుకు, పశుగ్రాసం, వ్యవసాయ పంపుసెట్లకు నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని, చెరువులన్నీ నింపాలని, రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందజేయాలని, నష్టపోయిన పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని రైతు నేతలు కోరుతున్నారు.

కళాకారులకు ఉచితంగా ఐడీలు: పోసాని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని కళాకారులకు ఉచితంగా ఐడీ కార్డులు ఇస్తామని, కళాకారులకు అండగా నిలుస్తామని ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణ మురళి తెలిపారు. విజయవాడలోని ఏపీ ఎఫ్‌డీసీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని కళాకారులకు ఉచితంగా ఐడీ కార్డులు ఇచ్చే ప్రక్రియను చేపట్టనున్నామని చెప్పారు. గతంలో కళాకారులకు, టెక్నీషియన్లకు ఐడీలు ఇచ్చే విషయంలో అనేక అక్రమాలు జరిగేవని, కమీషన్లు తీసుకునే వారన్నారు. ఇకపై అలాంటివి ఇక్కడ ఉండబోవని స్పష్టం చేశారు. ఈ ఐడీల వల్ల బయట వారికి కళాకారుల ఎంపిక సులభతరం అవుతుంద న్నారు. చిత్ర పరిశ్రమలోని మా అసోసియేషన్‌లో సభ్యత్వం కావాలంటే డబ్బులు ఇవ్వాలని, ఇతర అసోసియేషన్లలోనూ అదే పరిస్థితి ఉందని వివరించారు. ఏపీలో మాత్రం కళాకారులకు ఐడీలు ఉచితంగా జారీ చేస్తామన్నారు. ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా జూనియర్ ఆర్టిస్టులకు నేరుగా సినిమా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంద న్నారు. జూనియర్ ఆర్టిస్టులు ఎంతో కష్టపడుతున్నప్పటికీ, వారి డబ్బులు సగం ఏజెంట్లు తింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెంట్ల మధ్యవర్తిత్వం లేకుండా ఆన్‌లైన్లో సెర్చ్ చేస్తే కళాకారుల వివరాలన్నీ వచ్చేలాగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూనియర్ ఆర్టిస్టులకు ఇంకా ఎలాంటి రాయితీలు ఇవ్వాలనే దానిపై పరిశీలిస్తున్నామని చెప్పారు. అల్లు అర్జున్‌కు జాతీయ అవార్డు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీకి సహకరించే పార్టీలను వ్యతిరేకిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

పెట్రోల్, డీజిల్ ధరలను అమలు చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. దేశంలో మోదీ గ్రాఫ్ పడిపోతోందన్నారు. మోదీకి వ్యతిరేకంగా ఉండే పార్టీలపై స్వతంత్ర సంస్థలతో దాడులు చేయిస్తూ బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలకు కేంద్రం పాల్పడుతోందని, ఇందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు వైఎస్ జగన్, కేసీఆర్ నిదర్శనమని నారాయణ అన్నారు. నాడు కేసీఆర్, ఆయన కుమార్తె కవిత బీజేపీని దుర్భాషలాడారని గుర్తుచేశారు. నేడు ఏపీలో జగన్ తన సోదరుడు, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, తెలంగాణలో కవిత జైళ్లకు వెళ్లకుండా ఉండేందుకు మోదీకి వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు లేకపోయినా తెలుగు రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ నడుస్తోందని విమర్శించారు.

బీజేపీ ఏం చెబితే జగన్, కేసీఆర్ ఆచరిస్తున్నారని నారాయణ ఎద్దేవా చేశారు. విభజన హామీల అమలు కోసం కేంద్రాన్ని నిలదీయడంతో ఇద్దరు ముఖ్యమంత్రులు విఫలమయ్యారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి రాజధానికి పునాది రాయి వేసిన ప్రధాని మోదీ, నేడు అక్కడి పరిస్థితేమిటో ఆరా తీయకుండా మౌనంగా ఉండిపోతున్నారని నారాయణ అన్నారు.

మహిళల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు

- దసరాకు టీడీపీ పూర్తి మేనిఫెస్టో
- మహాశక్తి కవచాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయదశమి రోజు మహిళల సమక్షంలో టీడీపీ పూర్తిస్థాయి ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తామని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా మహాశక్తి కవచాన్ని చంద్రబాబు ఆవిష్కరించి ప్రసంగించారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ తొలుత రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ఆప్యాయతకు రాఖీ పండుగ నిదర్శనమని అన్నారు. తెలుగుదేశం పార్టీ తొలి నుంచి మహిళా సంక్షేమానికి కృషి చేస్తోందని, భవిష్యత్తులోనూ దానిని కొనసాగించేందుకు ఇటీవల మహానాడులో మహాశక్తి పేరుతో అద్భుత పథకాన్ని ప్రకటించామన్నారు. 1986లోనే ఎన్టీఆర్ మహిళలకు ఆస్తి హక్కు కల్పిస్తూ చట్టం చేశారు. వారికి ప్రత్యేకంగా పద్మావతి విశ్వవిద్యాలయం పెట్టారు. ఆడపిల్ల పుడితే బాలికా సంరక్షణ పథకం కింద నాడు పుట్టగానే రూ.5 వేలు డిపాజిట్ చేశాం. దీంతో ఆడపిల్లలకు ఎంతో మేలు జరిగింది. ఆడబిడ్డలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 33 శాతం రిజర్వేషన్లు పెట్టాం. దీంతో మహిళలు ఎంతో లబ్ధి పొందారు. దీని వల్ల మహిళలు బాగా సంపాదిస్తున్నారు. తద్వారా వరకట్నం అనే సమస్య పోయింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళా కండక్టర్ల విధానం తీసుకువచ్చాం. ఆడ బిడ్డలకు ఆర్థిక స్వాతంత్ర్యం కోసం డ్వాక్రా సంఘాలు పెట్టాం. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే బడికి వెళ్లే ఆడ పిల్లలకు సైకిళ్లు ఇచ్చాం. ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్లు కట్టించాం. మహిళలు వంట ఇబ్బందులు పడుతుంటే... అవి చూసి దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్‌లు ఇచ్చాం. మహిళల కోసం 10 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేశాం. సామూహిక శ్రీమంతాలు పెట్టాం. పెళ్లి కానుకను అందించాం. తల్లికి వందనం అని పిల్లలతో తల్లి కాళ్లు కడిగించాం. మన సంస్కృతి సంప్రదాయాల కోసం ఇవన్నీ చేశాం. ఇవన్నీ ఎవరో చెబితే చెయ్యలేదు. మీరు పైకి రావాలి అని చేశానని చంద్రబాబు గతంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఇప్పుడు మళ్లీ మహాశక్తి అనే కార్యక్రమం ప్రకటించాను. ఈ పథకంలో తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ రూ.15 వేలు ఇస్తాం. ఆడబిడ్డ నిధి కింద ఒక్కో మహిళకు రూ.1,500 నెలకు ఇస్తాం. ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, అవసరం అయితే ఇంకో సిలిండర్ అదనంగా ఉచితంగా ఇచ్చే ఆలోచన చేస్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఇచ్చాం. ఎన్టీఆర్ ఆత్మగౌరవం ఇస్తే... నేను ఆత్మస్థైర్యం ఇచ్చాను. దీంతోనే మహిళలు అద్భుతాలు సృష్టించే అవకాశం ఉందని, తెలుగు ఆడబిడ్డలను శక్తివంతమైన మహిళలుగా మార్చడమే నా లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, ఇతర రాష్ట్ర నేతలు, పెద్ద సంఖ్యలో మహిళలు చంద్రబాబుకు రాఖీలు కట్టారు.

ఏయూ పరిశోధక విద్యార్థిగా ద్వారకా తిరుమల రావు

విశాలాంధ్ర -విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లేనర్ రీసెర్చ్ హబ్‌లో పరిశోధక విద్యార్థిగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సి. హెచ్ ద్వారకా తిరుమలరావు చేరారు. బుధవారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి నుంచి ఆయన ఉత్తర్వులను స్వీకరించారు. అనంతరం ఏయూ వీసీతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రెండు సంస్థలకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించారు. ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో సేవలకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో వస్తువులను రవాణా చేయడంతో ప్రజలు గణనీయంగా ఆదరిస్తున్నారన్నారు. నూతనంగా బసులు కొనుగోలు, ఎలక్ట్రిక్ బసుల వినియోగం తదితర అంశాలను వివరించారు.ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఏయూలో బీబీఏ, ఎంబీఏ చేస్తున్న విద్యార్థులకు ఆరీసీలో ఇంటర్న్ షిప్ కల్పించాలని కోరగా ద్వారకాతిరుమల రావు సంసిద్ధత వ్యక్తం చేశారు.

ఎస్ఐ తుది విడత రాతపరీక్ష

అక్టోబర్ 14, 15 తేదీల్లో

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎస్ఐ తుది విడత రాత పరీక్షల్ని అక్టోబర్ 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక బోర్డ్ బోర్డు చైర్మన్ అతుల్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు మొత్తం నాలుగు పేపర్లుగా పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ పరీక్షలు జరుగుతాయి. ఇందులో రెండు పేపర్లు ఆబ్జెక్టివ్, మరో రెండు పేపర్లు సబ్జెక్టివ్‌గా ఉంటాయి. ప్రతి రోజు ఉదయం 10 గంటలకు నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. రాష్ట్రంలోని విశాఖ, గుంటూరు, ఏలూరు, కర్నూలులో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సివిల్ (మెన్, ఉమెన్), ఏపీఎస్పీ (మెన్) ఎస్ఐ పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక బోర్డ్ బోర్డు ఈ పరీక్షలు నిర్వహించనుంది. ఈ పోస్టుల భర్తీ కోసం ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీన ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించగా, 57,923 మంది అర్హత సాధించారు. వారిలో 56,130 మంది శారీరక సామర్థ్య పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. వారందరికీ ఈ నెల 25వ తేదీన విశాఖ, ఏలూరు, గుంటూరు, కర్నూలు కేంద్రాల్లో శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు విజయవంతంగా పూర్తి చేసుకున్న వారందర్నీ తుది విడత రాత పరీక్షలకు ఎంపిక చేశారు. పూర్తి వివరాలను రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక బోర్డ్ బోర్డు వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు.

టీడీపీ ఏజెంట్‌గా పురందేశ్వరి: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తెలుగు దేశం పార్టీ ఏజెంట్‌గా మారారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఘాటుగా విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు... బీజేపీని, నరేంద్రమోదీని తిట్టిన నోటితోనే మళ్లీ పొగుడుతున్నారని ఎద్దేవా చేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సజ్జల మాట్లాడుతూ... బీజేపీతో చంద్రబాబును కలిపేందుకు పురందేశ్వరి, పవన్ కల్యాణ్ కలసి పైరవీలు చేస్తున్నారన్నారు. బీజేపీతో పొత్తుకు చంద్రబాబు తహతహలాడుతున్నారని విమర్శించారు. నాడు ప్రత్యేక హోదా వద్దు ప్యాకేజీ చాలని చంద్రబాబు చెప్పిన మాటలు ప్రజలు మరిచిపోలేదని గుర్తు చేశారు. 175 నియోజకవర్గాలలో అభ్యర్థులను ప్రకటించే సత్తా చంద్రబాబుకు లేదన్నారు. ప్రజలను భ్రమలలో పెట్టాలనుకుని వారే భ్రమలలో బతుకుతున్నారంటూ మండిపడ్డారు. ఎన్టీఆర్ స్మారకనాణెం కార్యక్రమానికి లక్ష్మీపార్వతిని పిలవకుండా ఎన్టీఆర్ ఆత్మను మరోసారి క్షోభకు గురిచేశారన్నారు. ఈ విషయంలో నీచరాజకీయాలు చేశారని, చంద్రబాబు రాక్షస ప్రవృత్తితో ప్రవర్తించారని దుయ్యబట్టారు. రాష్ట్రపతి నిలయాన్ని రాజకీయాలకు వేదికగా మార్చారని, రాజకీయాలు ప్రజలకోసం ఉండాలని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌ను చంద్రబాబు వీలున్నప్పుడల్లా వెన్నుపోటు పొడుస్తూనే ఉన్నారని, ఇప్పుడు మరోసారి వెన్నుపోటు పొడిచారన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వానికి 70 శాతం ఓటర్ల మద్దతు ఉందని, అన్ని పార్టీలు కలిసినా వైసీపీ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

- పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలి
- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నెక్కంటి సుబ్బారావు

విశాలాంధ్ర-ఏలూరు: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని మున్సిపల్ వర్కర్స్ జాతీయ ఫెడరేషన్ సభ్యులు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాస్, జంగారెడ్డిగూడెం కార్యదర్శి కె.విఘ్నేష్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కో కన్వీనర్ తోర్లపాటి బాబు నాయకులను వేదికపైకి ఆహ్వానించారు. నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చెత్తను సేకరించి, ప్రాణాలకు తెగించి డ్రైనేజీలో ఉన్న మురుగు తొలగించి ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టి పారిశుద్ధ్య కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. జగన్ ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు గడిచినా క్రమబద్ధీకరణ ఊసే లేదని తెలిపారు. రాష్ట్రంలో 130 మంది పారిశుద్ధ్య కార్మికులు కరోనా సమయంలో విధి నిర్వహణలో మరణించారని, ఎక్స్‌గ్రేషియా కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.50 వేలు చెల్లిస్తానని ప్రకటన చేసి పాలకులు మోసం చేశారని విమర్శించారు. తక్షణం ఆ కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో నియమించిన అదనపు సిబ్బందిని తర్వాత తొలగించారని, వీరిని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం పారిశుద్ధ్య కార్మికులు వివిధ రూపాలలో ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం చేయలేదన్నారు. నగరాలలో జనాభాకనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులను పెంచాలని, అదనపు భారాన్ని తొలగించి, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిలారు మల్లేశ్వరరావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు పదవీ విరమణ చేసిన అనంతరం ఏర్పడిన ఖాళీలను తక్షణం భర్తీ చేయాలని, విధి నిర్వహణ సమయంలో మరణించిన కుటుంబాల వారసులకు కారుణ్య నియమాకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని, ప్రతినెల 1వ తేదీనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ అలెవెన్స్ రెగ్యులర్‌గా ఇవ్వాలని, పీఎఫ్ ఖాతాలు ప్రారంభించి, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు కృష్ణమాచార్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు, ఏఐటీయూసీ నాయకులు కన్నబాబు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జంగారెడ్డిగూడెం కార్యదర్శి విఘ్నేశ్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌లు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఆప్కాస్ అని పేర్లు మార్చి కార్మికుల సీనియార్టీని కుదించడంతో ప్రభుత్వ ప్రయోజనాలు కోల్పోతున్నారని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తోర్లపాటి బాబు తీర్మానాలు ప్రవేశపెట్టగా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తొలుత ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిలారు మల్లేశ్వరరావు ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జంగారెడ్డిగూడెం ఇన్‌ఛార్జ్ జె.వి.రమణ రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొలిమే బాల యేసు, ది.జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు కార్యదర్శి ఎ.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

4వరకు 'టీఎస్ సెట్' దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-హైదరాబాద్: 'టీఎస్ సెట్' దరఖాస్తుల గడువును పొడిగించినట్లు అధికారులు వెల్లడించారు. టీఎస్ సెట్ దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 29తో ముగియగా, అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తులు స్వీకరించే గడువును సెప్టెంబర్ 4వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీ కాలేజీ లెక్చరర్ల ఉద్యోగాలకు అర్హత కోసం ప్రభుత్వం టీఎస్ సెట్ పరీక్ష నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. రూ. 1500 ఆలస్య రుసుము తో సెప్టెంబర్ 10వ తేదీ వరకు, రూ. 2 వేల ఆలస్య రుసుంతో సెప్టెంబర్ 18 వరకు, రూ. 3 వేల ఆలస్య రుసుంతో సెప్టెంబర్ 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు ఆలస్య రుసుముకు అదనం. సెప్టెంబర్ 26, 27 తేదీల్లో దరఖాస్తులను ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అక్టోబర్ 20 నుంచి అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, కర్నూల్, కరీంనగర్, తిరుపతి, మహబూబ్‌నగర్, మెదక్, వైజాగ్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. దరఖాస్తుల కోసం సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

దీనజనబంధు జల్లి విల్సన్

బిరుదుతో సత్కరించిన నాయి బ్రాహ్మణ వాయిద్య వృత్తి కళాకారుల సంఘం

విశాలాంధ్ర- విజయవాడ(చిట్టినగర్): మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌ను నాయి బ్రాహ్మణ వాయిద్య వృత్తి కళాకారుల సంఘం దీనజనబంధు బిరుదుతో సత్కరించారు. నాయి బ్రాహ్మణ వాయిద్య వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఇక్కడి అయోధ్య నగర్‌లోని శిక్షణ కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విల్సన్‌కు దీనజన బంధు బిరుదు ప్రదానం చేసి చిరుసత్కారం చేశారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ వాయిద్య వృత్తి కళాకారుల శిక్షణ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు గోనుగుంట్ల యలమందరావు మాట్లాడుతూ, జల్లి విల్సన్ నాయి బ్రాహ్మణ కళాకారుల సంక్షేమం కోసం, భవన నిర్మాణానికి విశేష కృషి చేశారన్నారు. చిన్ననాటి నుంచి నేటి వరకు కమ్యూనిస్టుగా, బడుగు బలహీన వర్గాల ప్రతినిధిగా నిలిచారన్నారు. తాత, తండ్రి కమ్యూనిస్టు కావటంతో వారి బాటని ఎంచుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు నాయకునిగా ప్రజల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకొని, ప్రజల సంక్షేమం కోసం, నేటికీ నిలవటం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ ఈ స్థలం సాధించడానికి, శిక్షణా కేంద్రం భవన నిర్మాణానికి నిధులు సాధించేందుకు యలమందరావు చేసిన కృషి మరువలేదేన్నారు. స్థలం కోసం వేటాడి, వెంటపడి నాటి శాసనసభ్యులు కె.సుబ్బరాజు, కార్పొరేటర్లుగా నేను, బుట్టి రాయప్ప, కార్పొరేషన్ అధికారులు ద్వారా జిల్లా కలెక్టర్ కు విన్నవించి, ఒప్పించి 2014లో భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు సమక్షంలో శంకుస్థాపన చేసి భవనం నిర్మించడం వరకు ఆయన పట్టుదల మరువలేనిదన్నారు. ప్రపంచీకరణ నేపథ్యం, ఆధునిక సమాజంలో సామాగ్రికి బదులుగా యంత్రాలు వచ్చి వృత్తులను కబ్జా చేసి వ్యాపారులు చొరపడ్డారన్నారు.

దేశంలో సంస్కృతి, సంప్రదాయాలు, జానపదాలు పట్ల ప్రజలకు గౌరవం ఉందన్నారు. ప్రత్యేకించి నాయి బ్రాహ్మణులు దేవుడి నుండి పేదవాడి వరకు నాటు మేళాలతో, డప్పు వాయిద్యాలతో వివాహాలు నిర్వహించేవారని గుర్తుచేశారు. నేటి వివాహాలలో ప్రాచీన వాయిద్యాలకు ఆదరణ తగ్గిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వృత్తి కళాకారులను సృష్టించుకోవాలనే ఉద్దేశంతో వాయిద్య కళాకారుల శిక్షణ కేంద్రానికి నిధులు ఇచ్చినట్టు తెలిపారు. ఎమ్మెల్సీగా మూడు సంవత్సరాల కాలంలో పాఠశాలలకు, వైద్యశాలలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రాంతాలలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం కోసం మూడు కోట్ల రూపాయలు నా లెటర్ ద్వారా కలెక్టర్‌ని కోరగా మంజూరు చేశారన్నారు. ఆ మొత్తంలో ఈ భవనానికి కేటాయించిన ఐదు లక్షల రూపాయలు కూడా ఉన్నాయని చెప్పారు. నా నిధులు సంపూర్ణంగా సద్వినియోగమయ్యాయని భావిస్తున్నానన్నారు. కళాకారులను కాపాడుకునేందుకు పూర్తి సహాయ సహకారాలు నిరంతరం అందచేస్తానన్నారు. ముందుగా మాజీ కార్పొరేటర్ బుట్టి రాయప్ప వాయిద్య వృత్తి కళాకారుల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ సంఘానికి ఏ సమస్య వచ్చినా వెన్నంటివుండి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు అతిథులను వాయిద్య కళాకారులు మేళతాళాలతో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పొదిలి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి ఇంటూరి మురళీకృష్ణ, కోశాధికారి తాతపూడి అంజలి, కార్యవర్గ సభ్యులు ఉప్పలపాటి వసంత రావు, పి.నాగమణి, జి.శ్రీనివాస, ఎస్ శ్రీనివాసు, ఉప్పలపాటి ప్రభాకర్, నర్సిపురం సురేష్, శిక్షకులు నాగ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా నంది నాటక అవార్డుల ఎంపిక

ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణ మురళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వం నిర్ణయించిన ఐదు విభాగాల్లో నంది నాటక అవార్డులకు ఉత్తమ కళాకారుల ఎంపిక ఎంతో పారదర్శకంగా చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎఫ్‌డీసీ) చైర్మన్ పోసాని కృష్ణ మురళి తెలిపారు. బుధవారం ఉదయం విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ ఆవరణలోని ఏపీఎఫ్‌డీసీ కార్యాలయంలో చైర్మన్ పోసాని కృష్ణ మురళి, మేనేజింగ్ డైరెక్టర్ టి.విజయ కుమార్‌రెడ్డి జ్యూరీ సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాకు నంది నాటక పురస్కారాల కోసం ఉత్తమ కళాకారులను ఎంపిక చేసేందుకు అనుసరిస్తున్న ప్రక్రియను వివరించారు. ఈ ఎంపికలో ఎలాంటి సిఫార్సులకు తావు ఉండబోదని ఆయన స్పష్టంచేశారు. పద్య నాటక విభాగానికి సంబంధించిన న్యాయ నిర్ణేతలు తమ పర్యటనను సెప్టెంబరు 8న కర్నూలు నుంచి ప్రారంభించి 18 వ తేదీతో విశాఖపట్నంలో ముగిస్తారని వివరించారు. సాంఘిక నాటకం, యువజన నాటిక విభాగం న్యాయ నిర్ణేతలు... సెప్టెంబరు 10న పిఠాపురంలో పర్యటన ప్రారంభించి 18 వ తేదీన కర్నూలులో ముగిస్తారన్నారు. సాంఘిక నాటికలు, బాలల నాటికల న్యాయ నిర్ణేతలు సెప్టెంబరు 7 న అనంతపురం నుంచి ప్రారంభించి 18 వ తేదీన విశాఖపట్నంలో తమ పర్యటనను ముగిస్తారని వివరించారు. తుది ప్రదర్శనకు అర్హమైన కళా బృందాలను సెప్టెంబరు 19 వ తేదీ కల్లా ప్రకటించనున్నట్లు వివరించారు.

న్యాయ నిర్ణేతలు వీరే...

నాటక రంగ తెలుగు రచనలకు సంబంధించి ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ (చీరాల), ఆచార్య గుమ్మా సాంబశివ రావు (విజయవాడ) , ఆచార్య ఎస్.వి.కృష్ణారావును (గుంటూరు) న్యాయ నిర్ణేతలుగా నియమించినట్లు పోసాని కృష్ణమురళి తెలిపారు. పద్యనాటక విభాగానికి కురుటి సత్యం నాయుడు (విశాఖపట్నం), ఎమ్.కుమార్ బాబు (తెనాలి), మెతుకపల్లి సూర్య నారాయణ యాదవ్ (ఏలూరు)టీ సాంఘిక నాటకం, యువజన నాటికకు ఆకుల మల్లేశ్వర రావు (తిరుపతి), పి.శివ ప్రసాద్ (విశాఖపట్నం), ఎస్ఆర్ఎస్ ప్రసాద్ (ప్రొద్దుటూరు), సాంఘిక, బాలల నాటిక విభాగానికి డాక్టర్ కేజీ వేణు (విశాఖపట్నం), డా.దాసిరి నల్లన్న (తిరుపతి), పి.సుమ (సుబ్రహ్మణ్యం) (ఒంగోలు)ను న్యాయ నిర్ణేతలుగా నియమించిందన్నారు. ఈ ఏడాది పద్య, సాంఘిక నాటకం, బాలల, యువజన నాటికలతో పాటు నాటక రంగ తెలుగు రచనలు అనే ఐదు విభాగాల్లో నంది నాటక పురస్కారాల కోసం అర్హులైన కళాకారులు, రచయితల నుండి మొత్తం 118 దరఖాస్తులు అందాయన్నారు. వీటిలో నాటకరంగ తెలుగు రచన విభాగానికిగాను 3 దరఖాస్తులు, పద్యనాటకానికి 26, సాంఘిక నాటకానికి 22, యువజన నాటికకు 9, సాంఘిక నాటికకు 49, బాలల నాటిక విభాగం కింద 9 వెరసి మొత్తం 118 దరఖాస్తులు అందినట్లు వివరించారు. వీటిలో నాటక రంగ తెలుగు రచన విభాగం క్రింద ఒక పుస్తకాన్ని ఎంపిక చేయాల్సి ఉందన్నారు. పద్యనాటకం కోసం 10 దరఖాస్తులను, సాంఘిక నాటకానికి 6, యువజన నాటికకు 5, సాంఘిక నాటికకు 12, బాలల నాటిక విభాగం కింద 5 వెరసి మొత్తం 39 దరఖాస్తుదారులను తుది ప్రదర్శన కోసం ఎంపిక చేయాల్సి ఉందని పోసాని కృష్ణమురళి వివరించారు.

'నిజామాబాద్ ఐటీ హబ్'కు ఆదరణ

హైదరాబాద్: ఇటీవల ప్రారంభమైన నిజామాబాద్ ఐటీ హబ్‌లో కంపెనీలను ఏర్పాటు చేయడానికి ప్రముఖ సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇప్పటికే అనేక సంస్థలు తమ కంపెనీలను ఏర్పాటు చేయగా... తాజాగా ఆ జాబితాలోకి ప్రముఖ హిటాచి గ్రూపు అనుబంధ సంస్థ గ్లోబల్ లాజిక్ వచ్చి చేరింది. నిజామాబాద్ ఐటీ హబ్‌లో కంపెనీ ఏర్పాటు చేయాలని ఆ సంస్థ నిర్ణయించింది. అమెరికాలోని కాలిఫోర్నియాలోని ప్రధాన కార్యాలయం కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న గ్లోబల్ లాజిక్ సంస్థకు హైదరాబాద్‌లో గచ్చిబౌలి, జూబ్లీహిల్స్‌లో రెండు క్యాంపస్‌లు ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం దాదాపు 3వేల మంది పనిచేస్తున్నారు. నిజామాబాద్ ఐటీ హబ్‌లో కంపెనీ ఏర్పాటు చేయడంపై ఈ నెల మొదటి వారంలో ఆ సంస్థ ప్రతినిధులు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో చర్చలు జరిపారు. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని కవిత ఇచ్చిన హామీ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు నిజామాబాద్ ఐటి హబ్‌ను ఇటీవల సందర్శించారు. అనంతరం కంపెనీ ఏర్పాటుకు ప్రతిపాదించగా కాలిఫోర్నియాలోని వారి ప్రధాన కార్యాలయం అనుమతులు ఇచ్చింది. కల్వకుంట్ల కవితతో సమావేశమైన కేవలం 29 రోజుల్లోనే సంస్థ ఏర్పాటు కావడం విశేషం.

ఏనుగు దాడిలో దంపతుల మృతి

- మరో యువకుడి పరిస్థితి విషమం
- పంట పొలాల ధ్వంసం
- బీభత్సం సృష్టించిన ఒంటరి ఏనుగు
- చిత్తూరు జిల్లాలో ఘటన

విశాలాంధ్ర- చిత్తూరు: చిత్తూరు జిల్లాలో ఓ ఏనుగు సృష్టించిన బీభత్సరంలో భార్యాభర్తలు ప్రాణాలు కోల్పోయారు. గుడిపాల మండలం 190 రామాపురం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇటీవల చిత్తూరు జిల్లా తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఇందులో ఒక ఏనుగు విడిపోయి తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన చిత్తూరు జిల్లా గుడిపాల మండల అటవీ సరిహద్దు గ్రామాలైన రామాపురం బసవ పల్లి తదితర గ్రామాల్లో సంచరిస్తూ హల్‌చల్ చేస్తోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం 190 రామాపురం గ్రామానికి చెందిన భార్యాభర్తలు సెల్వి, వెంకటేశులు తమ పొలం వద్ద పనులు చేసుకుంటున్న సమయంలో అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఒంటరి ఏనుగు ఒక్క ఉదుటున భార్యాభర్తలపై దాడి చేయడంతో వీరిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం ఆ ఏనుగు బస్వాపల్లి, 190 రామాపురం గ్రామాల సరిహద్దులో పంట పొలాలపై పడి బీభత్సం సృష్టించింది. అక్కడే పొలం వద్ద ఉన్న ఆవుపై దాడి చేయడంతో ఆవు కూడా మృతి చెందింది. పొలం వద్ద ఉన్న కార్తీక్ అనే యువకుని పై దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న గ్రామస్తులు హుటాహుటిన సంఘనా స్థలానికి చేరుకుని కార్తీక్‌ను ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అయితే ఒంటరి ఏనుగు గ్రామాల సమీపంలో సంచరిస్తున్నా అటవీ శాఖ అధికారులు స్పందించలేదని 190 రామాపురం గ్రామస్తులు చిత్తూరు- చెన్నై జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో ఈ మార్గంలో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారి చైతన్య కుమార్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో ఈ విషయాన్ని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఐదు లక్ష రూపాయల చొప్పున పరిహారం ప్రకటించినట్లు తెలిపారు. అనంతరం ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి ధర్నా ప్రాంతానికి వెళ్లి వారికి నచ్చజెప్పి తన వంతుగా బాధిత కుటుంబానికి మరో రూ. రెండు లక్షలు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసులు సైతం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడిన కార్తీక్ కు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఒంటరి ఏనుగును బంధించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం గుడిపాల మండల అటవీ సరిహద్దు ప్రాంతాల్లో సంతరిస్తున్న ఒంటరి ఏనుగును బంధించేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

చిత్తూరు జిల్లాలో ఏనుగుల బెడద

చిత్తూరు జిల్లాలో అడవి ఏనుగుల వరుస దాడులు కొనసాగుతున్నాయి. అటవీ ప్రాంతాల నుంచి పొలాల్లోకి వస్తున్న గజరాజులు.. తమ భారీ దేహంతో బీభత్సం సృష్టిస్తున్నాయి. పొలాల్లో పనులు చేసుకునే వారిపై దాడులు చేస్తున్నాయి. ఇటీవల ఈ తరహా దాడులు తరచూ నమోదు అవుతున్నాయి. పంట పొలాలను నాశనం చేయడం, వాటిని తరిమి కొట్టడానికి ప్రయత్నించిన వారిపై, పొలాల్లో పనులు చేసుకుంటున్న వారిపై దాడి చేసి హతమారుస్తున్నాయి. ఏనుగుల దాడుల వల్ల ఒక వైపు పంట చేలు నాశనమై ఆర్థికంగా నష్టపోవడంతో పాటు... వాటి దాడిలో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

సంపాదకీయం

మొక్కుబడి ప్రజాస్వామ్యం

పార్లమెంటరీ వ్యవస్థ మీద విశ్వాసం లేకపోయినా అధికారంలోకి రావడానికి ఈ వ్యవస్థను పెద్ద నిచ్చెనలా వినియోగించుకునే వారికి ఆ వ్యవస్థ సవ్యంగా కొనసాగాలన్న సంకల్పం లేకపోవడం ఎంత మాత్రం ఆశ్చర్యం కలిగించదు. చట్ట సభలు-అవి కేంద్రంలోని రాజ్యసభ లేదా లోకసభ, రాష్ట్రాలలోని శాసన సభలు, ఉన్న చోట శాసన మండలి సమావేశాలు ఏటా మూడు సార్లు కచ్చితంగా నిర్వహించాలని నిబంధన ఉంది. దీనికి తోడు రెండు సమావేశాల మధ్య ఆరు నెలలకు మించిన అంతరం ఉండకూడదన్న నియమమూ ఉంది. ఈ నిబంధనల్లోని స్ఫూర్తిని కాకుండా సార రహితమైన ఆ మాటలను అమలు చేయడమే పార్లమెంటరీ వ్యవస్థలో విశ్వాసం లేని వారు పనిగా పెట్టుకున్నట్టున్నారు. తాజాగా కల్లోలితంగా ఉన్న మణిపూర్ శాసనసభ సమావేశం జరిగిన తీరు పార్లమెంటరీ వ్యవస్థను ఎంతగా అపహాస్యం చేస్తోందో రుజువైంది. మంగళవారం మణిపూర్ శాసనసభ సమావేశం నిర్వహించక పోలేదు. కానీ కేవలం 11 నిముషాలలోనే సభ ముగిసింది. ఆ వెంటనే స్పీకర్ తోక్చోం సత్యబ్రత సభను నిరవధికంగా వాయిదా వేసి ఓ పని అయిపోయిందనిపించారు. ఈ సభలో ముఖ్యమంత్రి ఓ సంతాపం తీర్మానం ప్రతిపాదించారు. సభ కొనసాగిన 11 నిముషాల సేపూ ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేస్తూనే ఉన్నారు. అంత మాత్రం దానికి శాసనసభ సమావేశం ఎందుకు నిర్వహించారు అని ప్రశ్నించడం కేవలం అమాయకత్వమే. మే ఆరంభం నుంచి మణిపూర్ కల్లోలితంగా ఉంది. అక్కడ కుకీ, మెయితీ జాతుల వారి మధ్య హింసాత్మక సంఘటనలు జరుగుతున్నాయి. ఆ రాష్ట్రంలో మెయితీలు అధిక సంఖ్యలో ఉన్నారు. కుకీలు అల్పసంఖ్యాకులు. కొందరు నాగాలు కూడా ఉన్నారు. వీరందరూ అల్పసంఖ్యాకులే కాక ఎక్కువ మంది క్రైస్తవ మతం అనుసరిస్తారు. ఇది బీజేపీకి నచ్చడం లేదు. శాసనసభలో మెయితీలదే ఆధిక్యత. వారిలో ఎక్కువ మంది బీజేపీ సమర్థకులే. బీజేపీ ఆ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఇది రెండవ సారి. మణిపూర్ లో మారణ కాండ కొనసాగినా కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదు. హెూం మంత్రి అమిత్ షా మూడు రోజులు ఆ రాష్ట్రంలో పర్యటించారు కానీ ఆయన ప్రజలతో మాట్లాడనే లేదు. చాలా వరకు ఫోన్ సంభాషణలతోనే కాలం గడిపారు. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుని ఉంటే మణిపూర్ ఇప్పటికీ మంటల్లో చిక్కుకుపోయి ఉండేదే కాదు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకైతే మణిపూర్ లో పర్యటించే తీరికే లేదు. ఇటీవలి పార్లమెంటులో అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో తప్పదు కాబట్టి ప్రధాని మోదీ దాదాపు రెండు గంటలు ప్రసంగించారు. అందులో మణిపూర్ ప్రస్తావన కొన్ని సెకన్లు మాత్రమే. అదీ మొక్కుబడిగానే. మణిపూర్ అంశంపై ప్రధానమంత్రి ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు రోజుల తరబడి కోరినా, పార్లమెంటు సమావేశాలకు తీవ్ర ఆటంకం కలిగినా ప్రధానమంత్రి పట్టించుకోనే లేదు. తప్పదు కనక అవిశ్వాస తీర్మానంపై చర్చలో జోక్యం చేసుకున్నారు. నరేంద్ర మోదీ మొట్ట మొదటి సారి పార్లమెంటు భవనంలోకి ప్రవేశించినప్పుడు ఆ మెట్లకు మొక్కడం పార్లమెంటు మీద విశ్వాసం పొంగి పొరలినందువల్ల కాదు. అది ఓ ప్రతీక మాత్రమే. ఆయన హయాంలోనే పార్లమెంటు సమావేశాల కాలం విపరీతంగా కుంచించుకు పోతోంది. ఒక వేళ జరిగినా మోదీ పాల్గొన్న సందర్భాలు, గడిపిన సమయం నామ మాత్రమైందే. మోదీ హయాంలో పార్లమెంటు సమావేశాలు అంటే ఓ లాంఛనం పూర్తి చేయడంగా తయారైంది. పార్లమెంటరీ సమావేశాలకు ప్రతిపక్షాలు అడ్డు తగలడాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ మోదీ హయాంలో అధికార పక్షమే సభా నిర్వహణకు అడ్డు తగులుతూ కొత్త ఒరవడి సృష్టించింది. ఈ అంశాలపై మోదీ ఒక్క సారి కూడా పెదవి విప్పరు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అధికార పక్ష సభ్యులకు మార్గదర్శకంగా ఉన్న ఉదంతాలే లేవు.

పార్లమెంటు పరిస్థితే ఇంతగా దిగజారినప్పుడు 60 మంది సభ్యులున్న మణిపూర్ శాసనసభలో పార్లమెంటరీ సంప్రదాయాలను గౌరవిస్తారనుకోవడం అత్యాశే. పైగా మోదీ మాటల్లో చెప్పాలంటే అక్కడ "డబుల్ ఇంజన్ సర్కారు" ఉంది. మంగళ వారం జరిగిన శాసన సభా సమావేశాలకు మారణకాండలో బాగా దెబ్బ తిన్న కుకీల ప్రతినిధులు పది మంది హాజరు కానే లేదు. వీరిలో ఇద్దరు మంత్రులూ ఉన్నారు. శాసన సభలో పది మంది నాగా ఎమ్మెల్యేలూ సమావేశాలకు హాజరు కాకపోవచ్చునని ముందు అనుకున్నారు. కానీ వారు హాజరయ్యారు. తాము హాజరు కాబోమని కుకీ ప్రజా ప్రతినిధులు ముందే తెలియజేశారు. ఎవరు హాజరయ్యారు ఎవరు కాలేదు అన్నది ముఖ్యమైన సంకేతమే అయినా అసలు శాసనసభ సమావేశమే మొక్కుబడిగా జరిగింది. మణిపూర్ ప్రస్తుతం కుమ్మరి ఆవంలా ఉంది. మెయితీలు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలకు కుకీలు వెళ్లడానికి, కుకీలు ఎక్కువ సంఖ్యలో ఉన్న చోట్లకు వెళ్లడానికి మెయితీలు జడుస్తున్నారు. వారిని ప్రాణ భయం పీడిస్తోంది. మణిపూర్ లో డబుల్ ఇంజిన్ సర్కారు ఉన్నప్పటికీ అక్కడ శాంతి నెలకొనేలా చేయడానికి రాష్ట్రపతి పాలన విధించాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. తమ పార్టీ అధికారంలో ఉన్న చోట రాష్ట్రపతి పాలన విధించడానికి బీజేపీ కాంగ్రెస్ లాంటిది కాదు. ఒక వేళ ఆ పని చేస్తే మణిపూర్‌లో శాంతిభద్రతలు కొరవడ్డాయని, రాజ్యాంగ వ్యవస్థ దెబ్బ తిన్నదని అంగీకరించినట్టు అవుతుంది. వాస్తవాన్ని ఒప్పుకోవడం బీజేపీకి ఎప్పుడూ ఇష్టం ఉండదు. 11 నిముషాల స్వల్ప వ్యవధి పాటు శాసనసభ సమావేశాలు ఎందుకు నిర్వహించాల్సి వచ్చింది అని ప్రశ్నించే వారు ఉండొచ్చు. అసెంబ్లీ సమావేశాలు జరగకపోతే అక్కడ రాజ్యాంగ వ్యవస్థ విఫలమైనట్టే. గత మార్చి మొదటి వారంలో సమావేశాలు జరిగాయి. అంటే సెప్టెంబర్ మొదటి వారంలో తప్పకుండా జరగాలి. ఆ లాంఛనం కోసమే శాసనసభ సమావేశం ప్రహసన ప్రాయంగానే కాదు మొక్కుబడిగా నిర్వహించారు. శాసనసభను నామ మాత్రంగా నిర్వహించి అంతా సవ్యంగా ఉందని చెప్పడానికి ఎంత ప్రయత్నించినా ఇది పార్లమెంటరీ వ్యవస్థను, రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే. ఒక్క రోజే సమావేశాలు నిర్వహించాలని అక్కడి ప్రభుత్వం, గవర్నర్ అనసూయ, కడకు సభా వ్యవహారాల సలహా మండలి అనుకోవడం సభా కార్యకలాపాలు నిర్వహించడానికి కాదు. రాజ్యాంగ వ్యవస్థలు సవ్యంగా పని చేస్తున్నాయని నమ్మించడానికే. సభ సమావేశాలు నిర్వహించడాన్ని బీజేపీ డబుల్ ఇంజన్ సర్కారు ఓ బాధ్యతగా కాకుండా ఓ తంతుగా దిగజార్చింది. ఈ తంతులో గవర్నర్లు ఇష్టపూర్వక భాగస్వాములు అవుతున్నారు. అది బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కనిపిస్తుంది. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న చోట మరింత ఎక్కువగా ఉంది. తమిళనాడు, పంజాబ్, కేరళ, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్ గవర్నర్ల ప్రవర్తన ఆ వ్యవస్థనే అపహాస్యం చేస్తోంది. ఈ చేష్టలన్నీ బీజేపీకి పార్లమెంటరీ వ్యవస్థ మీద, రాజ్యాంగం మీద ఉన్న ఏహ్య భావానికే నిదర్శనం.

సంచారజాతులపై నిర్లక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డ్ తెగలు, సంచార డీనోటిఫైడ్ తెగలు ప్రధానమైనవి. వారు మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలి. జటాపు, కొండ దొర, మూక దొర, మన్నె దొర, సవర, గదబ, చెంచు, కోయ, గొంది ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన ఆదిమ గిరిజన సమూహాలు ఉన్నాయి. దాసరి, ఎరుకల, యానాది, సుగాలి, కొరవ, క్రైౖ నక్కలా ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని డినోటిఫైడ్ తెగలు. ఇంకా, వడ్డెర, పాముల, నిర్షికారి, బుడబుక్కల, మందుల, పూసల, గంగిరెద్దుల, బోయ, దొమ్మర, జోగి సంచార పాక్షిక సంచార తెగలలో కొన్ని. సాంప్రదాయ అంటరానితనం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా అత్యంత సాంఘిక, ఆర్థిక వెనుకబాటుతనానికి గురికావడం ప్రధాన అర్హత కలిగిన షెడ్యూల్ కులాల్లో ఇంకా అణగారిన, ఏమాత్రం గుర్తింపు లేని జంగమ దేవర, డక్కలి, కిన్నెర జోగులు, బేడ బుడగ జంగాల కులాలు నేడు కనుమరుగై పోతున్నాయి. జంగమోళ్లు వీరిని జంగం దేవర అని కూడ అంటారు. వీరు శివ భక్తులు. షెడ్యూల్డ్ కులాల జాబితాలో 9వ కులం బేడ బుడగ జంగం. బుడిగ, బేడ ఇలా రెండు రకాలుగా పిలుస్తారు. వీరు బుర్ర కథలు చెబుతారు. పగటివేషాలు, బిక్షాటన ఇవన్నీ వీరి కుల వృత్తులు. వీరికి సొంత భాష ఉంది. భారతదేశంలో దేశీయ భాషలు తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్నాయి. సరైన నోటిఫైడ్ డీనోటిఫైడ్ కమ్యూనిటీల భాషలపై పరిశోధన ఇంకా నిర్వహించలేదు. అనేక దేశాల్లో రక్షణ కోసం అనేక నమూనాలు అందుబాటులో ఉన్నాయి. ఈ వర్గాలకు చెందిన భాషలు. భారతదేశం భాషాపరంగా ప్రసిద్ధి చెందింది సాంస్కృతిక వైవిధ్యం. అయితే అధికారిక గణాంకాలు లేవు. ఇప్పటివరకు ఎస్టీ / ఎస్ఎస్టీ / డిఎస్టీ కమ్యూనిటీల భాష మాట్లాడేవారికి సంబంధించినది. కొన్ని అంచనాల ప్రకారం ఎస్టీ/ ఎస్ఎస్టీకి చెందిన 198 సంఘాలు ఉన్నాయి. డిఎస్టీ కమ్యూనిటీలు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు విస్తరించాయి. ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే 59 సెక్షన్లు ఉన్నాయి, వారి స్వంత మాండలికాలతో ఎస్టీ / ఎస్ఎస్టీ / డిఎస్టీ సంఘాలు. ప్రతి సంఘానికి విస్తారమైన జ్ఞానం, వారి ఔషధ అభ్యాసం, పర్యావరణ జ్ఞానం, వాతావరణ నమూనాలు, ఆధ్యాత్మిక వైఖరులు, కళాత్మక పౌరాణిక కథలున్నాయి. వీరి కళలు ఇంతకు ముందు జంగం కథలుగా ఈనాడు, బుర్రకథగా పిలుస్తున్నారు. ఒకనాడు మత ప్రబోధానికి, దేశభక్తికి ప్రతిబింబంగా నిలిచిన జంగం కథా కళారూపం రానురాను యాచనకు, ఉదర పోషణకూ ఉపయోగపడి తిరిగి ఈనాడు దేశభక్తిని ప్రబోధిస్తూ, ప్రజా సమస్యలను చిత్రిస్తున్నది. జంగం కథలు చెప్పే వారిని బుడిగె జంగాలని పిలుస్తారు. బుడిగెను కంచుతోగానీ ఇత్తడితోగానీ తయారు చేస్తారు. గుమ్మెటకు ఒక వైపు బెత్తపు చత్రాన్ని బిగించి, తోలుతో మూస్తారు. రెండవ పక్కన కూజామూతిలాగా, అనాచ్ఛాతీతంగా వుంటుంది. కథకునికి ఇరుపక్కల వున్న వంతగాళ్ళు ఒక్కొక్కరూ తమ గుమ్మెటను చంకకు తగిలించుకుంటారు. కుడి చేతి వేళ్ళతో, చర్మముపైన వాయిస్తూ రెండోపక్క మూస్తూ గుంభనగా శబ్దాన్ని తెప్పిస్తారు. కథ చెప్పె బుడిగె జంగం నిలువుటంగీ తొడిగి, తలపాగా చుట్టి, కాళ్ళకు గజ్జెలు, మువ్వలు కట్టుకుని, భుజంమీద తంబురాను ధరించి, చేతి వేలికి అందెలు తొడిగి, వాటిని తంబురాకు తట్టుతూ రెండవ చేతితో తంబురా తీగను మీటుతూ కథను ప్రారంభిస్తారు. కథకునికి వంతలుగా వున్నవారు గుమ్మెటలు ధరించి కథకునికి వంత పాడుతూ, పాట వరుస ననుసరించి గుమ్మెటలను వాయిస్తూ మధ్య మధ్య హాస్యగాడు చలోక్తులతో హాస్యాన్ని కుమ్మరిస్తూ, ప్రేక్షకుల్ని నవ్విస్తూ వారి మెప్పు పొందుతాడు. అనంతపురం జిల్లా కల్లూరులో అంతరించిపోతున్న కులాల జాబితాలో కిన్నెర జోగులు కులం ఒకటి. వీరు ఈ ప్రాంతంలో సుమారు నాలుగు వందల సంవత్సరాల కిందట వచ్చి స్థిరపడ్డారు. ఈ కిన్నెర అనేది డక్కలి, చెంచులలాగ సంచార జాతులకు చెందిన తీగ వాయిద్యం. కిన్నెర సంగీతంలో గాత్రం, సంగీతం ప్రాధాన్యత కలిగి ఉంటుంది. 12 వ శతాబ్దంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన డక్కలి కులస్తులు కిన్నెర వాయిద్యాన్ని వాయిస్తూ వస్తున్నారు. మాదిగ కులానికి ఉపకులం డక్కలి కులం. భిక్షాటన వీరి కుల వృత్తి. చారిత్రిక సంఘటనలు, జాంబ పురాణం, స్థానిక నాయకుల జీవితాలను కొంత కిన్నెర వాయిద్యంతో చెప్పటం జరుగుతూ వస్తుంది. వీరిని అంటరానివారిగా ఉండే వారు. డక్కలికి కిన్నెర జోగులుకు కొంత సారూప్యత ఉన్నా, ఆచార వ్యవహారాలలో తేడాలున్నాయి. వీరి భాష మరాఠీ. మరాఠీలో పర్ధాని ఉపకులం. ఇది అస్తిత్వ కులం కాదు. కిన్నెర సంగీత వాయిద్యంలో 11 మెట్లు ఉంటాయి, మూడు సొరకాయ బుర్రలు ఉంటాయి. బళ్లారి దగ్గర కురగోడు వీరి ప్రధాన స్థావరం. వీరి మాతృభాష మరాఠి. వారి కథ వస్తువు పాండవ వంశస్థులు. ఇప్పుడు మూడు భాషలు మిళితమై కొంత మరాఠీ కన్నడ తెలుగు కలసి ఉంటుంది. ఒకప్పుడు గోండులకు కిన్నెర వాయిద్యం సంగీతం తర్ఫీదు ఇచ్చారు. ప్రజలలో వినోదాన్ని, విజ్ఞానాన్ని పెంచి శ్రమ జీవితం, సంఘ జీవితాన్ని పెంపొందించే వారు. వీరి భాషకు లిపి లేదు. కాలం మారుతున్న కొద్దీ కులం అంతరించి పోతున్నది. ఇప్పటికైనా సంచార జాతులకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలి.

డా. యం.సురేష్‌బాబు, ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

చంద్రయాన్ 3 గొప్ప మోదీదేనట...!

జి.ఓబులేశు

ఆగస్టు 23 భారతదేశ చరిత్రలో మరో నూతన ఆవిష్కరణ జరిగింది. చంద్రయాన్-3 విజయ వంతంగా చంద్రునిపై ఎలాంటి ఆటంకం లేకుండా దిగింది. ఇంతవరకు ఏ దేశం అడుగిడని దక్షిణధృవ ప్రాంతంపై అడుగిడటం భారతదేశం సాధించిన ప్రత్యేక విజయం. 140 కోట్లమంది భారతీయుల ఆనందానికి అవధులు లేవు. ఇంతటి గొప్ప ఆవిష్కరణనను విజయ వంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తల, ఇంజినీర్ల, సమాచార, సాంకేతిక నిపుణులు, హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్ సిబ్బంది, బిఎస్ఎన్ఎల్ కమ్యూనికేషన్ వ్యవస్థల నిరంతర శ్రమ, త్యాగం, దీక్షా దక్షతలు అన్నీ కమలనాథుల ప్రచారం యావ ముందు బలాదూర్ అయినాయి. అంతరిక్ష పరిశోధనతో సహా వివిధ శాస్త్ర సాంకేతిక రంగాలలో గత 7దశాబ్దాలలో సాధించలేని విజయాలను ఈ 9 ఏళ్లలో సాధించగలిగాము. దీనికంతటికీ కారణం మోదీ అందిస్తున్న సహకారం, ప్రోత్సాహం, ఆయనకున్న దీర్ఘదృష్టి ఆయన తీసుకున్న వ్యక్తిగత శ్రద్ధ అని సత్యకుమార్ లాంటివారు మోదీని పొగడ్తలతో ముంచెత్తుతూ వ్యాసాలు ఇస్తున్నారు. "కాదేదీ కవితకు అనర్హం. ప్రతిదీ కవితామయమేనోయ్" కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల అని శ్రీశ్రీ చెప్పిన మాటలు బీజేపీ పరివారానికి చక్కగా అతుకుతాయి. 2019లో చంద్రయాన్-2 కూలిపోయినప్పటి నుండి నిన్నటివరకూ ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు ఇతరరంగాల నిపుణులు 4సంవత్సరాలు నిస్వార్థంగా అహో రాత్రులు కష్టపడి పనిచేసారు. హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ ఉద్యోగులకు 17నెలలుగా జీతాలు ఇవ్వకపోయినా, సకాలంలో విక్రమ్ లాంచర్‌కు కావాల్సిన విడిభాగాలను కడుపులు కాల్చుకుంటూ తయారుచేసి ఇచ్చారు. ఇస్రోకు నిధుల కోత విధించారు. మరి మోదీ ప్రోత్సాహం, సహకారం ఏంటో? దక్షిణాఫ్రికా దేశాలలో 4రోజుల పర్యటన ముగించుకొని అక్కడ నుంచి ఎకాఎకిన కర్నాటక ముఖ్యమంత్రిని కూడా తీసుకెళ్లకుండా ప్రోటోకాల్ నిబంధనలను ఉల్లంఘించి శాస్త్రవేత్తల వీపులు నిమరటమే సహకారం, ప్రోత్సాహం అంటే ఏమనుకోవాలి. ఈ విజయంలో, ప్రయోగంలో విభిన్న మతాలకు చెందిన శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లు ఉన్నారు. మతాతీత రాజ్యాంగం అమలు చేస్తామని ప్రమాణ స్వీకారం చేసి అధికారంలోకి వచ్చిన "పెద్దమనుషులు" విక్రమ్ లాండర్ అడుగుపెట్టిన ప్రదేశానికి శివశక్తి అని నామకరణం చేయటం రాజ్యాంగ ఉల్లంఘన, ఇతర మతస్థులను చులకన చేయటంకాదా? చంద్రయాన్-2 కూలిన ప్రాంతానికి 'తిరంగ' అని పేరుపెట్టడంలో కమలనాథుల కురచబుద్ధులు ఇట్లే అర్థమవుతాయి. 52 సంవత్సరాలపాటు జాతీయజెండాను 'తిరంగ'ను గౌరవించని, గుర్తించని సంఘ్‌పరివార్ తానులో ముక్కే మోదీ. అందుకే విఫలమైన చోటును తిరంగ, విజయం సాధించిన చోటును శివశక్తి అని నామకరణం చేయడం. పుక్కిట పురాణాల్లో చంద్రశేఖరుడి నెత్తిన ఉన్న చంద్రరేఖ చల్లనిదేవుడని తాపములు తీర్చు చందమామ అని జాబిల్లి అని అనుకొనే మనకు భూమి నుండి ఊడిపడిన ఒక శకలం అని శాస్త్రీయ పరిశోధన రుజువుచేసింది. దేశంలోని ప్రభుత్వరంగం నేటి ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోయినా అవసరమైన మేరకు నిధులు సమకూర్చకపోయినా దేశప్రజలు, దేశ ప్రతిష్ఠను పెంచడానికి ఈ 70 సంవత్సరాల కాలంలో ఎంతో శ్రమించారు. 17నెలలుగా జీతాలు ఇవ్వకపోయినా హెవీ ఇంజినీరింగ్ సిబ్బంది విడిభాగాలను సకాలంలో తయారుచేసి ఇవ్వడం, బిఎస్ఎన్ఎల్‌ను గొంతు నులిమి ఉన్న అరకొర ప్రాణంతో కమ్యూనికేషన్ వ్యవస్థను సమకూర్చడం దేనికి సంకేతం? మోదీ ప్రభుత్వం స్పేస్ టెక్నాలజీని, అంతరిక్ష పరిశోధనా కేంద్రాలను కొంత ప్రైవేటీకరిస్తున్న వాస్తవాన్ని కప్పిపుచ్చి శాస్త్రవేత్తల, ఇంజినీర్ల విజయాన్ని తమఖాతాలో వేసుకోవటానికి కమలనాథులు ఆరాటపడుతున్నారు. కొవిడ్ మహమ్మారి విలయతాండవం చేస్తున్న రోజుల్లో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడిన ఆశా, అంగన్‌వాడి, ఉద్యోగులను ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా పిలిచి వారి జీతభత్యాల విషయంలో ఎలా అయితే అన్యాయం చేశారో అలానే చంద్రయాన్ విజయ వంతానికి కృషి చేసిన వారికి జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వరంగ పరిశ్రమలో బడ్జెట్ కేటా యింపులు ఇవ్వక, ఉద్యోగులను అవస్థలకు గురిచేసి కూడా తగుదునమ్మా అంటు వారి కృషిని, విజయాన్ని కమల నాథుల ఖాతాలో వేసుకోవటాన్ని జాణతనం అనుకోక ఏమను కోవాలి. ప్రతిష్ఠాత్మకమైన, నాణ్యమైన ఉత్పత్తు లతో దేశ ప్రతిష్ఠను పెంచుతున్న ప్రజల అవసరాలు తీర్చుతున్న ప్రభుత్వ కార్యక్రమాలకు, అవసరా లకు నిధులు సమకూర్చుతూ లాభాపేక్ష లేకుండా దేశసేవకు అంకితమైన ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఎండబెట్టి ప్రైవేటు వ్యక్తులకు ద్వారాలు తెరవడం వల్ల ఎంత నష్టపోయామో కొవిడ్ సమయంలో ప్రైవేటు ఆస్పత్రుల వాలకం, ప్రభుత్వ ఆస్పత్రుల సేవలు చూచిన తర్వాతనైనా ఈ ప్రభుత్వానికి బుద్ధిరాలేదు. ప్రజలను మత విశ్వాసాల్లో ముంచి తేల్చడానికి వికృత చేష్టలకు, మత ప్రచారాలకు పూనుకుంటున్నారు. చంద్రయాన్-2 ప్రయోగించిన ఇస్రో చైర్మన్ పేరు శివన్, ప్రస్తుత చైర్మన్ పేరు సోమనాథ్ గనుక శివభక్తుడైన మోదీవీరిని చూచి పరవశించిపోయారని పిచ్చిరాతలు రాస్తున్నారు. ఎవ్వరం ఇంతవరకు చేరుకోని చంద్రుడి దక్షిణధృవానికి మన చంద్రయాన్3 విక్రమ్ లాండర్ చేరుకోవటం శివనామాలవల్ల, భక్తి ప్రపత్తుల వల్లకాదని శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాల వల్లనే అనే యాదార్థాన్ని ఇప్పటికైనా మూఢభక్తులు గుర్తించితే మంచిది. నెహ్రూ డిఆర్‌డీఓ స్థాపన, ఇందిరాగాంధీ ఇస్రో ఏర్పాటు లేకుండానే మోదీ ప్రభుత్వం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎలా ముందుకు పోతున్నదో మోదీ భజనపరులు శెలవిస్తే బాగుంటుంది.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

కొండంత భారం-గోరంత సడలింపు

డాక్టర్ సీ.ఎన్ క్షేత్రపాల్ రెడ్డి

సామాన్యుడి వంటింటి మంటల సెగ తొమ్మిదేళ్ల తర్వాత మోదీ సర్కారును తాకింది. 2014 నాటి ఎన్నికల ప్రచార సభల్లో గ్యాస్ బండకు దండం పెట్టి తనకు ఓటు వేయాలని ప్రజల్ని మోదీ అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యాస్ ధరలతో ప్రజల్ని పీల్చి పిప్పి చేస్తోందంటూ మొసలి కన్నీరు కార్చారు. నాడు గ్యాస్ బండ ధర రూ.414. గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలతో పాటు అన్ని నిత్యావసర వస్తువులు ధరల్ని తగ్గించి అచ్చేదిన్ తెస్తానని నమ్మబలికారు. అధికారం చేజిక్కగానే తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టారు. 2015లో గ్యాస్ ధర అమాంతం రూ.606కు పెరిగింది. 2016లో రూ.747 కు చేరుకుంది. 2021 నాటికి రూ.819, 2022 చివరి నాటికి రూ.1150 దాటింది. తాజాగా రూ.1200లకు చేరువైంది. ఇలా తొమ్మిదేళ్ల కాలంలో గ్యాస్ ధరలు 144 శాతం పెరిగాయి.

దీంతో పాటు వినియోగదారులకు మోదీ ప్రభుత్వం మరో షాక్ఇచ్చింది. ఎల్పీజీ సిలిండర్లపై ఇస్తున్న రాయితీని క్రమంగాఎత్తేస్తూ వచ్చింది. 2016లో ప్రవేశపెట్టిన పీఎం ఉజ్వల యోజన కింద గ్యాస్ కనెక్షన్లు తీసుకున్న పేదలకు మాత్రమే రూ.200 రాయితీ అని సన్నాయి నొక్కులు నొక్కింది. తక్కినవారంతా ఎల్పీజీ సిలిండర్‌ను మార్కెట్ ధరకు కొనుగోలు చేయాల్సిందేనని కేంద్ర చమురుశాఖ స్పష్టం చేసింది. వంట గ్యాస్ సిలిండర్లపై జూన్ 2020 నుంచే సబ్సిడీని రద్దు చేసినట్టు తెలిపింది. నిజానికి 2020 నాటికి ఒక సిలెండరుపై ఇస్తున్న సబ్సిడీ సొమ్ము కేవలం రూ.40 కావడం గమనార్హం. ప్రభుత్వ రంగం సంస్థలను తగ్గించేసి ప్రైవేటు రంగానికి ప్రోత్సాహం ఇవ్వాలనేది మోదీ ప్రభుత్వం అజెండాలో భాగంగానే వంటగ్యాస్ సబ్సిడీని తగ్గించేసింది. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు గ్యాస్ సబ్సిడీ కోసం సుమారు రూ.38 వేల కోట్లు నిధులు కేటాయించగా రెండోసారి అధికారంలోకి రాగానే ఆ సొమ్మును కుదించేయడాన్ని గమనిస్తే గ్యాస్‌బండను ప్రజల పాలిట గుదిబండగా మార్చిన క్రమం అర్థమవుతుంది. గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ గణనీయంగా తగ్గిన విషయాన్ని ప్రభుత్వ గణాంకాలే వెల్లడించాయి. 2018-19లో సబ్సిడీ రూ.37,209 కోట్లుగా ఉంది. అది 2019-20లో రూ. 24,172 కోట్లకు తగ్గింది. 2020-21లో రూ.11,896 కోట్లకు పడిపోయింది. ఆ మొత్తం 2021-22 నాటికి రూ.1811 కోట్లకు పడిపోయింది. అదే తరుణంలో చమురు మార్కెటింగ్ కంపెనీలు భారీగా నష్టాలను చవిచూశాయని, ఈ నష్టాలను పూడ్చేందుకు ఆయిల్ కంపెనీలకు వేలకోట్ల పరిహారాన్ని అందించి తాము ఎవరి పక్షమో తేటతెల్లం చేసింది.

గత తొమ్మిదేళ్ల మోదీ పాలనలో నిత్యావసర ధరలు 30 నుంచి 60 శాతం పెరిగాయి. ఈ ధరల పెరుగుదలతో సామాన్యుడి బతుకు భారమైంది. ప్రైవేటీకరణ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రతికుటుంబంలో నెల వారీ ఖర్చులు రెట్టింపయ్యాయి. ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చినా మతతత్వ రాజకీయాల్ని నమ్ముకుని అధికారమదంతో మన్ను, మిన్ను కానక వ్యవహరించిన పాలకులకు ఇటీవల జరిగిన కన్నడనాట ఎన్నికల ఫలితాలు కళ్లు తెరిపించాయి. వారు నమ్ముకున్న మతతత్వ రాజకీయాలు. భజరంగ భళి నినాదాలు ఓట్లు రాల్చలేదు. ధరాభారంతో తాము ఎదుర్కొంటున్న కష్టాలకు బీజేపీ పాలనే కారణమని గ్రహించిన కన్నడ ఓటర్లు ఓటు దెబ్బ రుచిచూపించి అధికార పీఠం నుంచి దించేశారు. ఇది కన్నడ నాట ఉన్న ఓటరు తీర్పు మాత్రమే కాదని దేశం ఓటర్ల మూడ్ కూడా ఇలానే ఉందని గ్రహించిన పాలక పక్షం ప్రస్తుతం నేల చూపులు చూస్తోంది. మతతత్వ అజెండాతో మరో సారి జనాన్ని ఏమార్చలేమని గ్రహించి దిద్దుబాటు చర్యలకు దిగుతున్నట్టు కనిపిస్తోంది. ఇందులో భాగంగానే మంగళవారం జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశం పెరిగిన గ్యాస్ ధరల భారంలోంచి రూ. 200 ఉపసంహరించినట్టు ప్రకటించింది. ఇందుకు కారణం దేశవ్యాప్తంగా 30.50 కోట్ల ఎల్పీజీ కనెక్షన్లు ఉండడమే. రానున్న కొద్ది రోజుల్లో ఐదు రాష్ట్రాల ఎన్నికలున్నాయి. అందులో బీజేపీ పాలిత రాష్ట్రాలే ఎక్కువ. కాంగ్రెస్ పాలిత రాష్ట్రం రాజస్థాన్‌లో సిలిండరు రూ.500 లకే ఇస్తోంది. ఆయా రాష్ట్రాల్లోని గ్యాస్ వినియోగదారు కుటుంబంలో ఇద్దరు చొప్పున గ్యాస్ బండకు దండం పెట్టి ఓటు వేయడం కోసం వెళితే ఏమి జరుగుతుందో కళ్లముందు కనిపించడంతోనే గ్యాస్ ధరల్ని తగ్గించిందనేది సుస్పష్టం.

తన పాలనతో మూడింతలు పెరిగిన గ్యాస్ ధరలో రూ.200 తగ్గించి దేశ ప్రజలంతా పండగ చేసుకోండనే రీతిలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇది రక్ష బంధన్, ఓనం పండుగల నేపథ్యంలో మహిళలకు ఇస్తున్న కానుక అనడం పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలు కలిగించే నిర్ణయాలే తాము తీసుకుంటామని పేర్కొనడంపై సామాన్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నిజంగా పేద, మధ్యతరగతి వర్గాలపై అంత ప్రేమ ఉంటే గ్యాస్ ధరల్ని తాను అధికారంలోకి రాకముందటి కన్నా తక్కువకే ఇవ్వాల్సి ఉంటుంది. అది చేయకుండా తొమ్మిదేళ్ల పాటు ధరలభారం మోపి ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలున్నాయన్న భయంతోనే ఈ గోరంత తగ్గించారని ప్రజలు సులభంగానే గ్రహించగలరు. ఉజ్వల కింద ఉన్న వారికి మరో రూ.200 అదనంగా సబ్సిడీ ప్రకటించడం వెనుక కారణాలున్నాయి. ఇటీవలే కేంద్రం విడుదల చేసిన నివేదికల ప్రకారం, దేశంలో మొత్తం 8.03 కోట్ల మంది ఉజ్వల గ్యాస్ వినియోగిస్తున్నారు. ఈ వినియోగదారుల్లో ఎక్కువ శాతం బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందినవారే ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, అసోం తదితర రాష్ట్రాల్లోనే నాలుగు కోట్లకు పైగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్టు తెలుస్తోంది. ఆయా రాష్ట్రాల్లోనైనా పట్టు నిలుపుకునేందుకే అదనంగా మరో 200 సబ్సిడీ ప్రకటన.

ధరల నియంత్రణ బాధ్యతల నుంచి తప్పుకున్న మోదీ ప్రభుత్వం సామాన్యులను బలి పెట్టింది. 2017కి ముందు పెట్రోలు, డీజిల్ ధరలు ప్రతి మూడునెలలకు ఒకసారి మారుతూ ఉండేవి. కానీ 2017 జూన్ 15 నుంచి డైనమిక్ ఆయిల్ ప్రైస్ విధానం అమలులోకి వచ్చింది. దీంతో ప్రతిరోజు ఉదయం 6 గంటలకే పెట్రోలు బంకుల్లోనే తాజా ధరను ప్రకటించే విధానం మొదలైంది. ఈ క్రమంలోనే ఇంధన ధరలు ఆకాశాన్ని అంటాయి. యూపీఏ నాటికన్నా చౌకగా ముడి చమురు భారత్‌కు సరఫరా అవుతున్నా మోదీ ప్రభుత్వం ఇంధన ధరల్ని తగ్గించకుండా ప్రజల జేబుల్ని లూటీ చేస్తోంది. మోదీ వస్తే రూ. 40లకే పెట్రోలు అనుకున్న జనం నెత్తిన వచ్చిన నాటి నుంచి వడ్డన మొదలైంది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచే ఇంధన ధరల మోత ప్రారంభమైంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఇంధనంపై పన్నుల ద్వారా వస్తున్న ఆదాయం 2.94 లక్షల కోట్లకు పెరిగింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకుర్ 2021లో లోక్‌సభలోనే వెల్లడించారు. ఆయన ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో పెట్రోల్, డీజిల్ ద్వారా కేంద్ర ప్రభుత్వ ఆదాయం సుమారు 300 శాతం పెరుగుదల ఉన్నట్టు స్పష్టమైంది.

ఇప్పటి వరకూ సామాన్యుల జేబులకు చిల్లులుపెట్టి సంపన్నులకు నజరానాలు ప్రకటించిన మోదీ ప్రభుత్వానికి ధరల్ని తగ్గించాలనే జ్ఞాన దంతం ఇప్పుడే మొలిచింది అనుకోలేము. ఉన్నట్టుండి సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలపై ప్రేమ కురిపించడం వెనుక రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయం ఉంది. జనంలోనూ ఈ మోసకారి ప్రభుత్వాన్ని ఇక సహించకూడదనే భావనలు బలపడుతుండడంతో ఎన్‌డీఏ వెన్నుల్లో వణుకు మొదలైంది. కాబట్టే ఈ ధరల తగ్గింపు ఎన్నికల స్టంట్.

సెల్: 9059837847

మణిపూర్‌లో హింసపై 'సీబీఐ'

మహిళలపై నేరాల 19 కేసులు సహా 27 ఎఫ్‌ఐఆర్లలో దర్యాప్తు

న్యూఢిల్లీ : మణిపూర్ రాష్ట్రంలో జాతి ఘర్షణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆ రాష్ట్రంలోని పాలక ప్రభుత్వంగానీ, కేంద్రంలోని మోదీ సర్కార్‌గానీ హింసను నిరోధించి, శాంతియుత వాతావరణం ఏర్పాటు చేసేందుకు ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. కనీసం ప్రధాని మోదీ నెలలుగా ఆ అంశంపై పెదవి విప్పనేలేదు. అయితే ఇప్పటికీ రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు నాలుగు నెలల్లో 160 మందికి పైగా ప్రాణాలను బలిగొన్న మణిపూర్‌లో జాతి ఘర్షణలకు సంబంధించి నమోదయిన 27 ఎఫ్‌ఐఆర్‌ల దర్యాప్తును సీబీఐ చేపట్టిందని అధికారులు తెలిపారు. తాజా సమాచారం ప్రకారం, కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఇప్పటివరకు రాష్ట్ర పోలీసులు తనకు అప్పగించిన 27 కేసులను నమోదు చేసింది. వాటిలో మహిళలపై 19 నేరాలు, ఒక గుంపు ఆయుధాల దోపిడీకి సంబంధించినవి, రెండు హత్యలు. అల్లర్లు, హత్యలు, అపహరణ, సాధారణ నేరపూరిత కుట్రలో ఒక్కొక్కటి ఉన్నాయని ఆ వర్గాలు తెలిపాయి. దర్యాప్తు సంస్థ ఈ కేసులను మళ్లీ నమోదు చేసిందని, అయితే ఈశాన్య రాష్ట్రంలో నెలకొన్న సున్నితమైన పరిస్థితుల కారణంగా వివరాలను బహిరంగపరచలేదని వారు వివరించారు. సీబీఐ బృందాలు నేరాలు జరిగిన ప్రాంతాలను సందర్శించిన తర్వాత అనుమానితులను, బాధితులను ప్రశ్నించడం ప్రారంభించాయని ఆ వర్గాలు తెలిపాయి. ఈ కేసులను విచారించేందుకు దేశవ్యాప్తంగా సీబీఐకి చెందిన వివిధ విభాగాల నుంచి 29 మంది మహిళలతో సహా 53 మంది అధికారుల బృందాన్ని సీబీఐ ఉన్నతాధికారులు సమీకరించడంతో దర్యాప్తు ఊపందుకుంది. మణిపూర్‌లోని సమాజం జాతి ప్రాతిపదికన విభజించబడినందున, ఒక వర్గానికి చెందిన వ్యక్తుల ప్రమేయం మరొక వైపు నుంచి వేళ్లను చూపుతుంది. అందువల్ల ఆపరేషన్ సమయంలో పక్షపాత ఆరోపణలను నివారించడం సీబీఐ క్లిష్టమైన పనిని ఎదుర్కొంటుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. సీబీఐ విచారిస్తున్న ఈ కేసుల్లో చాలా వరకు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (వేధింపుల నిరోధక) చట్టం-1989లోని నిబంధనలు వర్తించవచ్చని, దీనిని పోలీసు డిప్యూటీ సూపరింటెండెంట్ స్థాయి అధికారి విచారించవచ్చని వివరించాయి. అటువంటి సందర్భాలలో డిప్యూటీ ఎస్పీలు పర్యవేక్షక అధికారులుగా ఉండలేరని, అందువల్ల దర్యాప్తును పర్యవేక్షించడానికి సీబీఐ తన ఎస్పీ ర్యాంక్ అధికారిలో ఒకరిని నియమించింది. ముగ్గురు డీఐజీలు లవ్లీ కతియార్, నిర్మలా దేవి, మోహిత్ గుప్తా, పోలీసు సూపరింటెండెంట్ రాజ్‌వీర్‌తో కూడిన బృందం మొత్తం దర్యాప్తును పర్యవేక్షిస్తున్న జాయింట్ డైరెక్టర్‌కు రిపోర్ట్ చేస్తుందని ఆ వర్గాలు తెలిపాయి. ఇంత పెద్ద సంఖ్యలో మహిళా అధికారులను ఏకకాలంలో సేవలోకి తీసుకురావడం ఇదే మొదటిసారి అని అర్థమవుతోందని వివరించారు. ఇద్దరు అదనపు పోలీసు సూపరింటెండెంట్‌లు, ఆరుగురు డిప్యూటీ సూపరింటెండెంట్‌లు... అందరూ మహిళలు 53 మంది సభ్యుల బృందంలో భాగంగా ఉన్నారు. ఇందులో 16 మంది ఇన్‌స్పెక్టర్లు, 10 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు కూడా ఉంటారని సంబంధిత వర్గాలు తెలిపాయి. మణిపూర్‌లో మే 3న షెడ్యూల్డ్ తెగ హోదా కోసం మెజారిటీ మైతేయి వర్గం డిమాండ్‌కు వ్యతిరేకంగా కొండ జిల్లాలలో 'గిరిజన సంఘీభావ యాత్ర' నిర్వహించడంతో జాతి హింస చెలరేగింది. ఈ సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో 160 మందికి పైగా మరణించారు. అనేక వందల మంది గాయపడ్డారు. మణిపూర్ జనాభాలో మైతేయిలు దాదాపు 53 శాతం ఉన్నారు. ఎక్కువగా ఇంఫాల్ లోయలో నివసిస్తున్నారు. నాగాలు, కుకీలతో సహా గిరిజనులు 40 శాతం ఉన్నారు. వీరు ఎక్కువగా కొండ జిల్లాలలో నివసిస్తున్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరి పోరు

మాయావతి

లక్నో : అన్ని పార్టీలు బీఎస్‌పీతో పొత్తు కోసం ఆసక్తిగా ఉన్నాయని, అయితే తమ పార్టీ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏతో లేదా విపక్షాల 'ఇండియా' కూటమితో చేతులు కలిపే ప్రశ్నే లేదని బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి బుధవారం అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏను ఎదుర్కోవడానికి ప్రతిపక్ష నాయకులు ఉమ్మడి ప్రచార వ్యూహాన్ని రూపొందించాలని భావిస్తున్న ముంబైలో 'ఇండియా' కూటమి సమావేశానికి ఒక రోజు ముందు మైక్రోబ్లాగింగ్ సైట్ 'ఎక్స్' లో వరుస పోస్టలలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్‌డిఎ మరియు ఇండియా బ్లాక్‌లు రెండూ 'పేద-వ్యతిరేక, కులతత్వ, వర్గ, ధనిక, పెట్టుబడిదారీ విధానాలను' కలిగి ఉన్న పార్టీలను కలిగి ఉన్నాయని మాయావతి పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా బీఎస్‌పీ పోరాటం కొనసాగుతోందన్నారు. 'అందుకే వారితో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసే ప్రశ్నే తలెత్తదు. అందుకే నేను మీడియాకు విజ్ఞప్తి చేస్తున్నాను. దయచేసి తప్పుడు వార్తలు వద్దు' అని ఆమె అన్నారు. బీఎస్‌పీతో పొత్తు పెట్టుకోవడానికి అందరూ ఆసక్తిగా ఉన్నప్పటికీ, తమతో పొత్తు పెట్టుకోకపోతే బీజేపీతో కుమ్మక్కయిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని, అలా చేస్తే 'మేము లౌకికవాదులం' అని పేర్కొంటూ, 'ఇది చాలా అన్యాయం' అని అన్నారు. 2007లో మాదిరిగానే బీఎస్‌పీ, విస్మరించిన కోట్లాది మందిని సోదరభావంతో కలుపుకుని వచ్చే లోక్‌సభ, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగింటిలో ఒంటరిగా పోటీ చేస్తుందని, మీడియా మళ్లీ మళ్లీ దుష్ప్రచారం చేయకూడదని ఆమె అన్నారు. మాజీ మంత్రి ఇమ్రాన్ మసూద్ బహిష్కరణను ప్రస్తావిస్తూ... 'బీఎస్‌పీ నుంచి బహిష్కరణకు గురైన సహరాన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్‌ను, ఆ పార్టీ అగ్ర నేతలను పొగిడే పనిలో నిమగ్నమయ్యారు. అసలు పార్టీని వీడి వేరే పార్టీలోకి ఎందుకు వెళ్లాడు.. ఇలాంటి వారిని ప్రజలు ఎలా నమ్ముతారు?' అని ఆమె అన్నారు.

స్కూల్ ఎగ్గొట్టారని విద్యార్థులను కర్రతో చితకబాదిన ప్రిన్సిపల్

జార్ఖండ్‌లో ఘటన

రాంచీ: ఓ పాఠశాల ప్రిన్సిపాల్...యాభైమంది విద్యార్థులను క్యూలో నిలబెట్టి మరీ కర్రతో చితకబాదిన దిగ్భ్రాంతికర ఘటన జార్ఖండ్‌లో చోటుచేసుకుంది. ఒకరోజు పాఠశాలకు రానందుకే తమను దారుణంగా కొట్టారని పిల్లలు చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే... జార్ఖండ్ రాష్ట్రం పాలము జిల్లా సత్బర్వా పోలీస్ స్టేషన్ పరిధిలోని భోగు గ్రామంలో ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో యూకేజీ నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న సుమారు 50మంది పిల్లలు తమ గ్రామమైన ఖమ్డీలో శ్రావణ సోమవారం నిర్వహించిన 'కలశ్ యాత్ర'కు హాజరయ్యేందుకు వెళ్లారు. దీంతో పాఠశాలకు రాలేకపోయ్యారు. తిరిగి మంగళవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులపై పాఠశాల ప్రిన్సిపాల్ చందన్ కుమార్ శర్మ తన ప్రతాపం చూపించారు. సోమవారం పాఠశాలకు ఎందుకు రాలేదంటూ వరుసబెట్టి అందరినీ విచక్షణారహితంగా కర్రతో కొట్టారు. తరగతులకు హాజరుకాకపోవడానికి కారణాలు చెబుతున్నప్పటికీ, ప్రిన్సిపాల్ తమను కొట్టారని పిల్లలు చెబుతున్నారు. 'మేము మా గ్రామంలోని కలశ్ యాత్రకి వెళ్లామని ప్రిన్సిపాల్ సర్‌కి చెప్పినా కూడా అతను మా శరీరాలపై అర్రులు పడేలా కర్రతో విచక్షణారహితంగా కొట్టాడు' అని 5వ తరగతి విద్యార్థి తెలిపాడు. తన పేరు బయటకు చెప్పవద్దని కోరాడు. వరుసగా నిల్చోబెట్టి కొట్టిన తర్వాత... ఇంట్లో తల్లిదండ్రులతో ఏమీ చెప్పవద్దని బెదిరించాడని చెప్పాడు. అయితే పిల్లలు ఇంటికి వెళ్లిన తర్వాత తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పడంతో వారి శరీరంపై ఉన్న కర్ర గుర్తులను చూసి కోపోద్రిక్తులై స్థానిక పోలీసులను ఆశ్రయించారు. కాగా ఈ విషయమై తనకు అధికారికంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. కాగా ఈ విషయమై మేము పాఠశాల ప్రిన్సిపాల్‌ను పిలిపించి, సంఘటన వివరాలను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నామని సత్బర్వా పోలీస్ స్టేషన్ అధికారి అమిత్ కుమార్ సోని చెప్పారు. ఇప్పటి వరకు సేకరించిన సమాచారం ప్రకారం... పిల్లలు గోలీలు ఆడుతుండటాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు వీడియో తీసి దానిని వారి టీచర్‌కు పంపారు. ఇది పాఠశాల ప్రిన్సిపాల్‌కు చేరడంతో ఆగ్రహానికి గురై వారిని కొట్టారని సోనీ తెలిపారు. అయితే ప్రిన్సిపాల్ పిల్లలను కొట్టి ఉండకూడదని ఆయన అన్నారు. 'మేము దీనిపై ఇంకా దర్యాప్తు చేస్తున్నాం... విచారణ పూర్తయిన తర్వాత సరైన చర్యలు తీసుకుంటాం' ఆయన వివరించారు.

ప్రధానికి రాఖీ కట్టిన చిన్నారులు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ రక్షా బంధన్ వేడుకను పాఠశాల విద్యార్థినులతో కలిసి చేసుకున్నారు. ఢిల్లీ పాఠశాలల విద్యార్థులు బుధవారం ఉదయం ప్రధాని నివాసానికి వెళ్లి ఆయనకు రాఖీ కట్టారు. తరువాత వారితో మోదీ కొంతసేపు సరదాగా గడిపారు. ఇందుకు సంబంధించిన చిత్రాలను భారతీయ జనతా పార్టీ తమ అధికారిక ఎక్స్ (ట్విటర్) ఖాతాలో పంచుకుంది. అంతకుముందు రాఖీ పండుగ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని శుభాకాంక్షలు తెలిపారు. "రక్షాబంధన్ ఒక పవిత్రమైన పండుగ. మన దేశ సంస్కృతికి ప్రతిరూపం. ఈ పండుగ ప్రజల జీవితాల్లో బంధాలు, ఆప్యాయత, సామరస్య భావాలను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షిస్తున్నా" అంటూ పోస్టు చేశారు.

కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని

దేశమంతటా ప్రతిబింబిస్తోంది

రాహుల్ గాంధీ 'గృహలక్ష్మి' ప్రారంభం

మైసూరు : కర్నాటకలో ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన కీలక వాగ్దానాలను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుందని, సిద్ధరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం చేపడుతున్న పని దేశవ్యాప్తంగా ప్రతిబింబిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బుధవారం అన్నారు. ఎన్నికల ముందు మరో కీలక వాగ్దానాన్ని నెరవేర్చేందుకు కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం 'గృహ లక్ష్మి' పథకాన్ని ప్రారంభించి వారి ఇంటి పెద్దలయిన దాదాపు 1.1 కోట్ల మంది మహిళలకు నెలవారీ రూ.2 వేల సహాయం అందిస్తోంది. వేలాది మంది ప్రజలు హాజరయిన మహారాజా కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ కార్యక్రమంలో ఈ పథకాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు ఎం.మల్లికార్జున ఖర్గే ప్రారంభించారు. ఆయనతో పాటు పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'మేము వాగ్దానాలపై మా మాటను నిలబెట్టుకున్నాము. 'మేము ఎప్పుడూ తప్పుడు వాగ్దానాలు చేయము' అని అన్నారు. కర్నాటకలో మేము చేసిన పని భారతదేశం అంతటా పునరావృతమవుతుంది' అని తెలిపారు. అభిమానుల కోలాహలం మధ్య ప్రారంభించిన 'గృహ లక్ష్మి' పథకం, మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీని అధికారం నుంచి తొలగించిన కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఐదు 'హామీ' లలో ఒకటి. 'కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు హామీలు కేవలం పథకాలు కాదు, అవి పాలన నమూనా' అని రాహుల్ అన్నారు. 'గృహ లక్ష్మి' పథకాన్ని 'ప్రపంచంలోనే అతిపెద్ద నగదు బదిలీ పథకం'గా అభివర్ణించారు. దీని ద్వారా లక్షలాది మంది మహిళా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.2 వేలు బదిలీ చేస్తారు. 'శక్తి', 'గృహ జ్యోతి', 'అన్నభాగ్య', 'గృహలక్ష్మి', 'యువ నిధి' అనే ఐదు 'హామీ'లను అమలు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాన్ని చేసింది. కర్నాటకలో ఎక్కడికైనా ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు 'శక్తి' పథకం ఉచిత ప్రయాణాన్ని అందిస్తుందని, అయితే 'గృహ జ్యోతి' నెలకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందజేస్తుందని రాహుల్ గాంధీ చెప్పారు. 'అన్న భాగ్య' పథకం ద్వారా 10 కిలోల బియ్యాన్ని అందజేస్తుండగా, 2022-23 విద్యా సంవత్సరంలో పరీక్షలను పూర్తి చేసి ఆరు నెలల తర్వాత కూడా ఉద్యోగం పొందడంలో విఫలమైన వారికి, 'యువ నిధి' నిరుద్యోగ గ్రాడ్యుయేట్‌లు, డిప్లొమా హోల్డర్‌లకు వరుసగా నెలకు రూ.3 వేలు, రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చింది. 'యువ నిధి' పథకాన్ని మినహాయించి, నాలుగు హామీలు (శక్తి, గృహ లక్ష్మి, గృహ జ్యోతి, అన్న భాగ్య) రాష్ట్ర మహిళలకు ఉద్దేశించినవి. ఈ నాలుగు హామీల వెనుక లోతైన ఆలోచన ఉంది' అని ఆయన వివరించారు. కర్నాటక మహిళలను చెట్టు వేళ్లతో పోల్చిన కాంగ్రెస్ ఎంపీ, వేర్లు బలంగా ఉంటే ఆ చెట్టు ఎలాంటి తుపానునైనా తట్టుకోగలదని అన్నారు. గత ఏడాది తన 'భారత్ జోడో యాత్ర' లో భాగంగా కర్నాటకలో 600 కిలోమీటర్ల దూరం నడిచినప్పుడు దేశంలో ధరల పెరుగుదలపై మహిళలు విసిగిపోయారని గ్రహించానని గాంధీ చెప్పారు. మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లే ఈ హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్‌కు స్ఫూర్తినిచ్చాయన్నారు. కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంపై ఆయన ధ్వజమెత్తారు. ఈ రోజుల్లో 'ఢిల్లీ ప్రభుత్వం' బిలియనీర్ల కోసం మాత్రమే పనిచేస్తుందనే 'ఫ్యాషన్' ఉందని అన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలనేది మా ఆలోచన అని ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ దేశంలోని ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి పథకాన్ని ప్రారంభించలేదని, ప్రతి ఒక్కరూ తమ రాష్ట్రంలో దీన్ని అమలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాట్లాడుతూ 'శక్తి', 'గృహ జ్యోతి', 'అన్నభాగ్య' అనే ఐదు 'హామీ'లలో (ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు) మూడింటిని ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసిందని, 'గృహ లక్ష్మి' నాల్గవది అని గుర్తు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 'గృహలక్ష్మి' కార్యక్రమానికి ప్రభుత్వం రూ.17,500 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

ప్రధాని రేస్‌లో కేజ్రీవాల్ లేరు

ఢిల్లీ మంత్రి అతీషి స్పష్టీకరణ

ఉన్నారన్న ఇద్దరు ఆప్ నాయకులు

న్యూఢిల్లీ : 'ఇండియా' కూటమి ప్రధాన మంత్రి అభ్యర్థిగా అరవింద్ కేజ్రీవాల్ ఉంటారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కు చెందిన ఇద్దరు నాయకులు బుధవారం అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆయన దేశం మొత్తం ప్రయోజనం పొందగల నమూనాను ఇచ్చారని అన్నారు. అయితే, కొన్ని గంటల తర్వాత కేజ్రీవాల్‌కు ప్రధాని పదవిపై ఆశ లేదని ఢిల్లీ క్యాబినెట్ మంత్రి అతీషి స్పష్టం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏను ఎదుర్కోవడానికి, తమ మధ్య ఉన్న విభేదాలను తొలగించడానికి ప్రతిపక్ష నాయకులు ఉమ్మడి ప్రచార వ్యూహాన్ని రూపొందించాలని ముంబైలో జరగనున్న 'ఇండియా' కూటమి సమావేశానికి ఒక రోజు ముందు ఈ వ్యాఖ్యలు వచ్చాయి. 'ఇండియా' కూటమికి ప్రధానమంత్రి అభ్యర్థిగా ఎవరు ఉండాలనే ప్రశ్నకు ఆప్ జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ పీటీఐతో మాట్లాడుతూ 'ఒక ప్రతినిధిగా నేను మా జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పేరును ప్రతిపాదిస్తాను' అని అన్నారు. కేజ్రీవాల్ నిరంతరం ప్రజల సమస్యలను లేవనెత్తారని, ఢిల్లీలో అతి తక్కువ ద్రవ్యోల్బణానికి దారితీసిన 'ఒక నమూనాను అందించారు' అని ఆమె తెలిపారు. 'ఆయన ప్రజలకు ప్రయోజనం చేకూర్చే నమూనాను ఇచ్చారు. అది జరగాలని నేను కోరుకుంటున్నాను. కానీ నిర్ణయం నా చేతుల్లో లేదు' అని ఆప్ ప్రధాన ప్రతినిధి అన్నారు. పార్టీ ఢిల్లీ కన్వీనర్, పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్‌ను దీని గురించి అడిగినప్పుడు, ఆప్‌లోని ప్రతి సభ్యుడు కేజ్రీవాల్‌ను ప్రధాని పదవికి కోరుకుంటున్నారని, అయితే దానిపై నిర్ణయం 'ఇండియా' కూటమి సభ్యులందరూ మాత్రమే ఖరారు చేస్తారని చెప్పారు. 'ప్రతి పార్టీ తమ నాయకుడు ప్రధాని కావాలని కోరుకుంటారు. ఆప్ సభ్యులు కూడా తమ జాతీయ కన్వీనర్‌ను ప్రధాని కావాలని కోరుకుంటారు. భారత కూటమిలోని సభ్యులందరూ కూర్చుంటారు. ఏ నిర్ణయం తీసుకున్నా మేము దాని ప్రకారం వెళతాము' అని చెప్పారు. ఆప్ ప్రధాన మంత్రి అభ్యర్థిగా కేజ్రీవాల్ పేరును ప్రతిపాదిస్తారా అని అడిగినప్పుడు, 'పేరు పెట్టడం లాంటిది ఏమీ లేదు. మేము ఇప్పటికే దానిలో భాగం. అరవింద్ కేజ్రీవాల్ కూటమిలో భాగమే' అని ఆయన అన్నారు. అయితే ప్రధాని పదవి రేసులో కేజ్రీవాల్ లేరని అతిషి తెలిపారు. కక్కర్ వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు ఢిల్లీ క్యాబినెట్ మంత్రి స్పందిస్తూ, 'అరవింద్ కేజ్రీవాల్ దేశ ప్రధాని అయ్యే రేసులో లేరని నేను అధికారికంగా చెబుతున్నాను' అని తెలిపారు. 'రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని రక్షించడానికి ఆయన 'ఇండియా' కూటమిలో చేరారు' అని పేర్కొంటూ, కక్కర్ అభిప్రాయాలు వ్యక్తిగతమన్నారు. కాగా, గత సంవత్సరం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆప్ సీనియర్ నాయకుడు, అప్పటి ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా కూడా కేజ్రీవాల్‌ను ప్రధాని అభ్యర్థిగా పేర్కొన్నారు. 'ఏక్ మౌకా కేజ్రీవాల్ కో' (కేజ్రీవాల్‌కి ఒక అవకాశం) జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారిందని సిసోడియా అన్నారు. '2024లో నరేంద్ర మోదీకి కేజ్రీవాల్‌ను ప్రత్యామ్నాయంగా ప్రజలు చూస్తున్నారు. ఎందుకంటే ఆయన ఆరోగ్యం, విద్య, ఉపాధి గురించి మాట్లాడుతున్నాడు' అని పీటీఐకి చెప్పారు.

నుహ్ అల్లర్లు... గోసంరక్షకుడు బిట్టు బజరంగికి బెయిల్

గురుగ్రామ్ : ఈ నెల ప్రారంభంలో నుహ్‌లో జరిగిన మత ఘర్షణలకు సంబంధించి అరెస్టయిన గోసంరక్షకుడు బిట్టు బజరంగీకి బుధవారం కోర్టు బెయిల్ మంజూరు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆగస్టు 17న నుహ్ కోర్టులో హాజరుపరచిన తర్వాత బిట్టు బజరంగిని 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. అతన్ని ఫరీదాబాద్ జిల్లాలోని నీమ్కా జైలులో ఉంచారు. అసిస్టెంట్ పోలీసు సూపరింటెండెంట్ ఉషా కుందు ఫిర్యాదు మేరకు నుహ్ సదర్ పోలీస్ స్టేషన్‌లో తాజాగా ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత బిట్టు బజరంగీ అలియాస్ రాజ్ కుమార్‌ను ఫరీదాబాద్‌లో అరెస్టు చేశారు.

ప్రజ్ఞానందను సత్కరించిన స్టాలిన్

చెన్నై: ఫిడే ప్రపంచ కప్-2023 రన్నరప్‌గా నిలిచిన భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానానందను బుధవారం తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఘనంగా సత్కరించారు. ఆళ్వార్‌పేటలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రిని కలిసిన సందర్భంగా రూ.30 లక్షల నగదు బహుమతితో పాటు జ్ఞాపికను ప్రజ్ఞానందకు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా 18ఏళ్ల ప్రజ్ఞానందపై స్టాలిన్ ప్రశంసలు కురిపించారు. తమిళనాడుతో పాటు యావద్దేశం గర్వించేలా గొప్ప ప్రదర్శన కనబర్చాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్, అధికారులు, ప్రజ్ఞానానంద తల్లిదండ్రులు పాల్గొన్నారు. భారత చెస్ యువ సంచలనం ప్రజ్ఞానంద ఇటీవల అజర్ బైజాన్‌లో జరిగిన ఫిడే ప్రపంచకప్‌లో రన్నరప్ గా నిలిచిన సంగతి తెలిసిందే. చిన్న వయసులోనే సంచలనాల మోత మోగిస్తున్న ప్రజ్ఞానంద త్రుటిలో ప్రపంచకప్ టైటిల్ కోల్పోయాడు. అయినప్పటికీ తన ప్రతిభతో యావత్ భారతావని ప్రేమాభిమానాలను గెలుచుకున్నాడు. ఈ గ్రాండ్ మాస్టర్ విశ్వవేదికపై భారత దేశ మేధస్సుకు ప్రతీకగా నిలిచిన తీరు అందర్నీ ఆకట్టుకుంది.

విమానాశ్రయంలో ఘన స్వాగతం

ఫిడే ప్రపంచకప్‌లో పాల్గొని స్వదేశానికి తిరిగి వచ్చిన ప్రజ్ఞానంద చెన్నై విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. తమిళనాడు ప్రభుత్వ అధికారులు, కళాకారులు, విద్యార్థులు, అభిమానులు పూలు, బొకేలతో ప్రజ్ఞానందకు స్వాగతం పలికారు. అనంతరం తన తల్లిదండ్రులతో కలిసి ప్రజ్ఞానంద సీఎం స్టాలిన్ నివాసానికి వచ్చాడు.

ఢిల్లీ వీధుల్లో పచ్చదనం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో సెప్టెంబరు 9, 10 జి-20 సదస్సు జరగనున్న క్రమంలో నగర వీధులు పచ్చదనంతో కళకళలాడనున్నాయి. జి-20 సదస్సుకు ముందు ఢిల్లీ వీధులను 2.5 లక్షల మొక్కల (కుండీల్లో నాటినవి)తో ఢిల్లీ అటవీశాఖ అలంకరిస్తున్నట్లు పర్యావరణశాఖ మంత్రి గోపాల్‌రాయ్ బుధవారం తెలిపారు. సుమారు 300 మంది అధికారులు, ఉద్యోగులకు ఈ మొక్కల సంరక్షణ బాధ్యతలు అప్పగించామని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ ప్రభుత్వం ఇప్పటికే 36 లక్షల మొక్కలు, పొదలను నాటిందని, వార్షిక ప్లాంటేషన్ లక్ష్యంలో 69 శాతం పూర్తి చేసిందని రాయ్ చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశ రాజధానిలో పచ్చదనం పెంచేందుకు ఢిల్లీ ప్రభుత్వం 52 లక్షల మొక్కలు, పొదలను నాటాలని లక్ష్యంగా పెట్టుకుంది. 'మేము జి-20 సమ్మిట్‌కు ముందు ఈ మొక్కలలో 50 శాతం నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. 36 లక్షల (69 శాతం) కంటే ఎక్కువ మొక్కలు, పొదలను నాటడం ద్వారా మేము ఈ లక్ష్యాన్ని అధిగమించామని తెలియజేయడానికి నేను సంతోషిస్తున్నాను' అని రాయ్ చెప్పారు. జి-20 సదస్సు అనంతరం శీతాకాలంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు శీతాకాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మిగిలిన ప్లాంటేషన్‌ను చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. జి-20 సదస్సు సెప్టెంబర్ 9, 10 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనుంది. ఈ సదస్సులో సభ్య దేశాలు,అతిథి దేశాల ప్రతినిధులు వివిధ ఆర్థిక సంస్కరణలపై చర్చించనున్నాయి.

ఆన్‌లైన్‌లో ఔషధ విక్రయాలపై చర్యలు

కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: సరైన లైసెన్స్ లేకుండా మందులను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఢిల్లీ హైకోర్టు కేంద్రప్రభుత్వాన్ని, ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. తగిన చర్యలు తీసుకోవడానికి, ఆన్‌లైన్‌లో చట్టవిరుద్ధంగా మందుల అమ్మకాలపై తన తుది నిర్ణయాన్ని కోర్టుకు తెలియజేయడానికి ప్రధాన న్యాయమూర్తి సతీశ్‌చంద్ర శర్మ, జస్టిస్ సంజీవ్ నరులాతో కూడిన ధర్మాసనం కేంద్రానికి ఆరు వారాల గడువును నిర్దేశించింది. కాగా ఆన్‌లైన్‌లో ఔషధాల విక్రయానికి సంబంధించిన ముసాయిదా నోటిఫికేషన్‌పై సంప్రదింపులు కొనసాగుతున్నాయని కేంద్రం తరపు న్యాయవాది కోర్టుకు తెలియజేయడంతో ధర్మాసనం... తదుపరి విచారణను నవంబర్ 16కు వాయిదా వేసింది. 'కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడానికి మరో ఆరు వారాల సమయం ఇవ్వబడింది. ఆ తర్వాత, ఈ విషయంలో కేంద్రం తుది వైఖరిని కోర్టుకు తెలియజేయండి. ఈ మధ్యకాలంలో డిసెంబరు 12, 2018 నాటి ఉత్తర్వును ఉల్లంఘించే వ్యక్తులకు సంబంధించి...అంటే, చెల్లుబాటయ్యే లైసెన్స్ లేకుండా ఆన్‌లైన్‌లో ఔషధాల విక్రయంలో నిమగ్నమై ఉన్న వ్యక్తులు, సంస్థలపై చట్ట ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడమైనది' అని ఆగస్టు 28న జారీ చేసిన ఉత్తర్వుల్లో ధర్మాసనం పేర్కొంది. ఆన్‌లైన్‌లో చట్టవిరుద్ధంగా సాగుతున్న మందుల విక్రయాలను నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని గతంలో హైకోర్టు కేంద్రాన్ని కోరింది. ఇలాంటి విక్రయాలపై నిషేధం విధించాలని కోరుతూ... డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ నిబంధనలను మరింత సవరించేందుకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రచురించిన ముసాయిదా నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కోర్టు విచారించింది.

విషవాయువు పీల్చి ఐదుగురు కార్మికుల మృతి

ఎంపీలో ఆహార పరిశ్రమలో ఘటన

మొరెనా : మధ్య ప్రదేశ్‌లోని మొరెనా జిల్లాలోని ఒక కర్మాగారంలో బుధవారం విషవాయువు పీల్చడం వల్ల ముగ్గురు సోదరులతో సహా ఐదుగురు కార్మికులు మరణించారని ప్రభుత్వ అధికారి తెలిపారు. జిల్లాలోని ధనేలా ప్రాంతంలోని సాక్షి ఫుడ్ ప్రొడక్ట్స్ ఫ్యాక్టరీలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం 11 గంటలకు ఫ్యాక్టరీ లోపల ఉన్న ట్యాంక్ నుంచి గ్యాస్ రావడం ప్రారంభించిందని, దానిని తనిఖీ చేసేందుకు ఇద్దరు కార్మికులు అందులోకి ప్రవేశించారని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్‌డీఎం) భూపేంద్ర సింగ్ కుష్వాహా పీటీఐకి తెలిపారు. గ్యాస్ పీల్చడంతో వారు అస్వస్థతకు గుర య్యారు. ఆ తర్వాత మరో ముగ్గురు కూలీలు కూడా అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. వారందరినీ జిల్లా ఆస్పత్రికి తరలించగా సివిల్ సర్జన్ గజేంద్ర సింగ్ తోమర్ వారు చనిపోయినట్లు ప్రకటించారని, మృతదేహాలను శవపరీక్షకు పంపినట్లు అధికారి తెలిపారు. ఈ కర్మాగారం శుద్ధి చేసిన చెర్రీస్, ఆహార ఉత్పత్తులలో ఉపయోగించే చక్కెర రహిత రసాయనాలను తయారు చేస్తుంది. మృతులు టిక్టోలి గ్రామానికి చెందిన సోదరులు రామవతార్ గుర్జార్ (35), రామ్‌నరేష్ గుర్జార్ (40), వీర్‌సింగ్ గుర్జాం (30), గణేష్ గుర్జర్ (40), గిర్రాజ్ గుర్జర్ (28) గా గుర్తించారు. ఘటన అనంతరం జిల్లా అధికారులు ఫ్యాక్టరీని ఖాళీ చేయించి తదుపరి విచారణ చేపట్టారు. మృతుల పట్ల ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సంతాపం వ్యక్తం చేసినట్లు ఒక అధికారి తెలిపారు.

ముస్లింలకు మోదీ సర్కార్ తీరని ద్రోహం

- న్యాయం చేసే ప్రభుత్వం కావాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా

విశాలాంధ్ర-కడప బ్యూరో: దేశంలోని ముస్లిం మైనార్టీలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసున్నదని, మత విద్వేషాలు రెచ్చగొడుతూ మానవత్వానికే మచ్చ తెస్తున్నదని, సమెక్య భారతదేశంలో ఇలాంటి విచ్ఛిన్నకర శక్తులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా వక్కాణించారు. సీపీఐ బస్సు యాత్ర సందర్భంగా కడప నగరంలోని కేఎంఆర్ ఫంక్షన్ హాలులో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు అమీర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తార్, నజీర్‌అహ్మద్, ముస్లిం నాయకులు ఫారూక్‌సుగ్రీ, అజ్మత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ సంచార్, రంగనాథ్ మిశ్రా నివేదికలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం బీరువాలో పెట్టి తాళం వేసిందన్నారు. ముస్లింలకు సంబంధించిన వక్ఫ్‌బోర్డు ఆస్తులను దేశవ్యాప్తంగా కొల్లగొట్టిందని విమర్శించారు. ముస్లిం మైనార్టీలకు సంబంధించిన అన్ని రకాల సంక్షేమ పథకాలకు ఎలాంటి న్యాయం చేయకుండా నిర్వీరామం చేసి మోదీ నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా చంద్రయాన్-3 విజయవంతమైందని ఆ విజయవంతంలో అన్ని కులాలు, మతాలకు చెందిన శాస్త్రవేత్తలు కలిసి ఉండి భారతదేశ సమైక్యతను పాటించేలా ముందుకు వెళితే మోదీ మాత్రం శివశక్తి అని నామకరణం చేయడం అన్యాయమన్నారు. సారాభాయి లాంటి శాస్త్రవేత్తలు ఎంతోమంది ఉన్నా శివశక్తి అని నామకరణం చేయడం విడ్డూరంగా ఉందని నిరసన వ్యక్తం చేశారు. దేశం ప్రస్తుతం ఎటువైపు వెళు తోందని ప్రజలు వేయికళ్లతో నిశిత పరిశీలన చేస్తున్నారని రాబోయే ఎన్నికలలో కేంద్రంలోని ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడం తథ్యమన్నారు. రాష్ట్రంలో ముస్లింలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని మైనార్టీ కార్పొరేషన్లు దోపిడీకి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలకు సంబందించిన సంక్షేమ అధికారులు, కార్పొరేషన్ చైర్మన్లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారు తప్ప వాటి వలన మైనార్టీలకు ప్రయోజనం లేదన్నారు. సీఎం జిల్లాలోనే వక్ఫ్‌బోర్డు ఆస్తులు కొల్లగొడుతున్నా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది చోద్యం చూస్తున్నారే తప్ప ఆస్తులు కాపాడే పరిస్థితిలో అధికారులు లేరన్నారు. ముస్లింలకు ఇచ్చే తోఫా పథకానికి కూడా నిధులు కరువయ్యాయని ఇలాంటి వారికా రాష్ట్ర అధికారం కట్టబెట్టిందని మైనార్టీలు మల్లగుల్లాలు పడుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఇలాంటి ప్రభుత్వాలను భూస్థాపితం చేయడం తొందరలోనే ఉందన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో మతతత్వ పార్టీ అయిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమాత్రం లేదని స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నది కాంగ్రెస్, సీపీఐ, ముస్లిం సోదరులేనన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో జరిగిన కర్నాటక ఎన్నికల్లో మతతత్వ పార్టీ బీజేపీ తుడిచిపెట్టుకు పోయిందని ఇదే ఆ పార్టీ పతనానికి నాంది అన్నారు. 25 కోట్ల ముస్లిం మైనార్టీలు ఉన్న భారతదేశంలో కేంద్రం వారికి తీవ్ర అన్యాయం చేస్తోందని ఇది క్షమించరాని నేరమన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని అన్నదమ్ముల్లా కలిసి ఉన్న హిందు, ముస్లిం మైనార్టీలను విడగొట్టే ప్రయత్నాలు విఫలమవుతాయని అన్నారు. కేంద్రంలో ఒక్క ముస్లిం మంత్రి లేకపోవడం ఆర్ఎస్ఎస్ భావజాలానికి నిదర్శనమన్నారు. ఇలాంటి పాలకులకు తగిన బుద్ధిచెప్పే రోజులు ముందున్నాయని రామకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, బాదుల్లా, మునెయ్య, పెద్దఎత్తున ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

బస్సు యాత్ర నేటి షెడ్యూల్

యర్రగుంట్లలో ఉదయం రోడ్ షో

ప్రొద్దుటూరులో రోడ్ షో

జమ్మలమడుగులో కడప స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపన స్థలం వద్ద నుండి ర్యాలీ - బహిరంగ సభ

బీజేపీ చేసిన మంచేమిటి

చంద్రబాబును నిలదీసిన రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: రాష్ట్రంలో జగన్ పాలన నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని చెప్పిన చంద్రబాబు నాయుడు కేంద్రంలో బీజేపీని సమర్థించటం ఎంతవరకు సబబు అని చంద్రబాబు నాయుడుని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. సీపీఐ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్రలో భాగంగా నెల్లూరు విచ్చేసిన రామకృష్ణ బుధవారం నెల్లూరులోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ప్రతిపక్ష పార్టీలు ఏకమై ఒక కూటమిగా బలమైనశక్తిగా ఎదుగుతుం డడంతో భయపడిన నరేంద్ర మోదీ ముందస్తు ఎన్నికలకు సిద్ధమవుతున్నారన్నారు. తొమ్మిది సంవత్సరాల నరేంద్ర మోదీ పరిపాలనలో రాష్ట్రానికి ఆయన ఏమి చేశారో ప్రజలకు చంద్రబాబు నాయుడు వివరించాలని డిమాండ్ చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మోదీ వరకు ఉన్న ప్రధాన మంత్రు లలో దేశాన్ని అప్రతిష్టపాలు చేసినటువంటి వ్యక్తి నరేంద్ర మోదీనే అని రామకృష్ణ అన్నారు. బీజేపీకి మొదటి నుంచి లౌకికవాదంపై విశ్వాసం లేదని మరోసారి అవకాశం కల్పిస్తే దేశాన్ని పూర్తిగా మతపరమైన దేశంగా మార్చేస్తుందని రామకృష్ణ హెచ్చరించారు బీజేపీ పాలనలో దేశానికి ప్రపం చంలో ఒక గుర్తింపు వచ్చిందని చంద్రబాబు చెప్పటం సరికాదన్నారు రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏమి చేశారో చంద్రబాబు చెప్పాలని రామకృష్ణ ప్రశ్నిం చారు. రాష్ట్రంలో జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి ఏ రోజు ప్రజా సంక్షేమం పైన దృష్టి పెట్ట లేదని పైగా తనను ప్రశ్నించే వారిపై పోలీసులు చేత అక్రమ కేసులు బలాయించడం కనీసం ప్రజలు, ప్రతిపక్షాలు ముఖ్యమంత్రిని కలిసేందుకు కూడా అవకాశం కల్పించని ఏకైక ముఖ్యమంత్రి జగనేనని రామకృష్ణ చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామ అంకయ్య మాట్లాడుతూ రామాయ పట్నం పోర్టు నిర్మాణ విషయంలో స్థానికులకు రావాల్సిన వనరుల సమకూర్చకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదనీ, పూల సుబ్బయ్య ప్రాజెక్టు విషయంలో కూడా ప్రభుత్వ వైఖరి స్పష్టంగా లేదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నెల్లూరు జిల్లా సహాయ కార్యదర్శి పి.మాలకొండయ్య, నెల్లూరు నగర కార్యదర్శి అరిగెలసాయి పాల్గొన్నారు.

కేంద్రంలో నిరంకుశ మత విద్వేష పాలన

- రాష్ట్రంలో దోపిడీ, దుర్మార్గం, అవినీతి రాజ్యమేలుతోంది
- వీటి అంతానికి ప్రజలంతా ఏకంకావాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర-కడప బ్యూరో: దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ పార్టీ కూడా ఇంత నిరంకుశంగా, మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పాలన కొనసాగించలేదనీ, రాష్ట్రంలో దోపిడీ, దుర్మార్గాలు అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని, కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వానికి రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వానికి ఏకకాలంలో బుద్ధి చెప్పడానికి దేశ ప్రజలంతా ఏకతాటిపై నిలబడాలని, రాబోవు రోజుల్లో ఇండియా కూటమికి సంపూర్ణ మద్దతు తెలిపి సుఖశాంతులతో ఉండే భారతదేశాన్ని తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాష్ట్రాన్ని రక్షించుకుందాం.. దేశాన్ని కాపాడుకుందా అనే నినాదంతో ఆగస్టు 17 నుంచి సెప్టెంబరు 8 వరకు తలపెట్టిన బస్సు యాత్ర బుధవారం కడప జిల్లా బద్వేల్‌లో అడుగు పెట్టింది. ఉదయం బద్వేల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించుకొని సాయంత్రం కడప నగరానికి చేరుకుంది. ముందుగా నగరంలోని రాజంపేట బైపాస్ వద్ద నుంచి సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలతో అప్సర సర్కిల్, వైజంక్షన్, ఆర్టీసీ బస్టాండు, కోటిరెడ్డిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ఏడురోడ్లకూడలిలోని బహిరంగసభ ప్రాంగణం వరకు స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ నరేంద్రమోదీ నిరంకుశ పాలనను అంతమొం దించడానికి ఇండియా కూటమి సన్నద్ధమవుతు న్నదన్నారు. దేశాన్ని రక్షించుకోవడం కోసం దుర్మార్గ పాలన అంతమొందించ డానికి ముందుకు వెళ్లే విధంగా సమీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల మధ్యన కుల మతాలపై చిచ్చు పెడుతూ హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అంటూ విభజించి మత, కుల, వర్గ, వైషమ్యాలను పురిగొల్పి దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ ఎత్తుగడలు వేస్తోందని దీనిని తిప్పికొట్టి తీరుతామ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం దోపిడీ మయమైపోయిందనీ, దోపిడీ నాయకులు యదేచ్ఛగా ఇసుక, మట్టి, లిక్కర్, మైనింగ్, భూకబ్జాలు చేస్తూ ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి ప్రకృతి వనరులను దోపిడీ చేస్తున్నారని విమర్శిం చారు. జగన్ నాలుగేళ్ల పాలనలో రాష్ట్రానికి ఒరగ బెట్టింది ఏమీ లేదని అభివృద్ధిని నిలువునా కూల్చేస్తు న్నాడని రాష్ట్రాన్ని అప్పులగుండంగా మార్చిన ఘనత జగన్‌కే దక్కు తుందన్నారు. జిల్లాలో రాజశేఖర్‌రెడ్డి కాలంలో ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయడంతోనే సరిపుచ్చుకున్నారని అనంతరం 2019లో చంద్ర బాబు ఎన్నికలు ముందు ఏదో నేను కట్టిస్తానన్న విధంగా ఆయన శంకుస్థాపన చేయడం జగన్ రెండు సార్లు శంకుస్థాపన చేసినా శిలాఫలకాలకే పరిమిత మైంది తప్ప ఏ విధంగా ఉపాధి మార్గాలు లేవన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశాన్ని మత విద్వేషాలతో అల్లకల్లోలం చేస్తోందని ఇలాంటి విషపూరితమైన పాలకులను త్వరలోనే గద్దెదింపే విధంగా ప్రజలు ముందుకు రావాలన్నారు. 9 సంవత్సరాల కాలంలో భారతదేశానికి చెప్పుకోదగ్గ ఒక్క పని కూడా కేంద్రం చేయలేదని విమర్శించారు. దేశంలో కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి దేశ ఆర్థిక మూలాలను నాశనం చేసేలా ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలకు దేశ ప్రకృతి వనరు లను తాకట్టు పెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పాలనతో పాటు కేంద్రాన్ని ఏమీ ప్రశ్నిం చలేని విధంగా చంద్రబాబు, జనసేన ఉన్నాయని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకు, కడప ఉక్కు ఫ్యాక్టరీకి కేంద్రం నుండి నిధులు తీసుకురావాల్సిన జగన్ రాష్ట్రానికి ప్రత్యేకహోదా వెనుకబడిన ప్రాం తాలకు ప్రత్యేక ప్యాకేజీ వంటివి ఏదీ సాధించలేకు న్నారని దీన్ని ఆసరాగా చేసుకొని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మాకెందుకులే అన్న విధంగా రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శిం చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్య దర్శి శివారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవీంద్ర నాథ్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్షులు వి.జయలక్ష్మీ, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, ఆంజనేయులు, బాదుల్లా, సుబ్ర హ్మణ్యం, వేణుగోపాల్, బషీరున్నీసా, విజయలక్ష్మి, వీరశేఖర్, చంద్రశేఖర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు మద్దిలేటి, ఏఐవైఎఫ్ నాయకులు వలరాజు, సుబ్బరాయుడు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ మెడలు వంచింది రైతు ఉద్యమమే

- ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య
- లఖింపురి ఘటనపై అక్టోబరు 3న దేశవ్యాప్త నిరసనలు

తిరుచురాపల్లి: మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతుల ఐక్య పోరాటం ప్రధాని మోదీ మెడలు వంచిందని అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) తమిళనాడు రాష్ట్ర సదస్సు తిరుచు రాపల్లిలో బుధవారం జరిగింది. అధ్యక్షు లుగా ఎస్‌కేఎం తమిళనాడు కో ఆర్డినేటర్ కె.బాల కృష్ణన్ వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, అఖిల భారత కిసాన్ సభ జాతీయ నాయకులు హసన్ మొల్ల హాజరయ్యారు. తమిళ నాడుకు చెందిన రైతు నాయకులు ఎస్.గుణ శేఖరణ్, మచిలీమని, శివశోరేన్ తదితర 11 సంఘాలకు చెందిన రైతు నాయకులు, వివిధ జిల్లాల నుంచి 700 మందికి పైగా రైతు ప్రతి నిధులు పాల్గొన్నారు. తొలుత సంయుక్త కిసాన్ మోర్చా జెండాను హసన్ మొల్ల ఆవిష్కరించారు. సదస్సులో రావుల వెంకయ్య మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన మూడు నల్ల చట్టాలు, విద్యుత్ సంస్క రణల బిల్లు రైతులకు ప్రమాదకరమైనవని, వాటికి వ్యతిరేకంగా 13 నెలలపాటు రైతులు ఐక్యంగా పోరాటం జరిపారన్నారు. ఈ మూడు నల్ల చట్టాలను దేశంలోని ఏడు రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. విద్యుత్ సంస్కరణ బిల్లును సైతం 11 రాష్ట్ర ప్రభుత్వాలు తిరస్కరిం చాయన్నారు. అందులో ఉత్తర ప్రదేశ్‌తో సహా నాలుగు బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఉన్నాయ న్నారు. దేశ వ్యాప్తంగా జరిగిన రైతు ఉద్యమంలో 540 రైతు సంఘాలు ఏకమై ఐక్య ఉద్యమాన్ని నడిపాయన్నారు. ఉద్యమానికి ప్రపంచంలోని అనేక దేశాలు మద్దతుగా నిలిచాయన్నారు. ఐక్యరాజ్య సమితి సైతం సంఘీ భావం తెలిపిందన్నారు. దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు సైతం జోక్యం చేసుకొని రెండు సంవత్సరాల పాటు ఈ చట్టాల అమలును వాయిదా వెయ్యాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సలహా ఇచ్చిందని తెలిపారు. ఈ ఉద్యమంలో 750 మంది రైతులు అమరులయ్యారని, 8 వేల మందికి పైగా రైతులపై కేసులు ఇప్పటికీ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇలాంటి చారిత్రాత్మక రైతు ఉద్యమం స్వాతంత్ర్యానికి ముందుగానీ, తరువాతగానీ దేశంలో జరగలేదన్నారు. అలాంటి ఉద్యమం ప్రధాని మోదీ మెడలు వంచి చట్టాలను ఉపసంహరించుకొని యావత్ రైతు లోకానికి క్షమాపణలు చెప్పేలా చేసిందన్నారు. నాడు రాత పూర్వకంగా రైతులకు వాగ్దానాలు ఇచ్చి సంవత్సరంన్నర దాటుతున్నప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. దాని కోసం మార్చి 20న దిల్లీలో జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో నిరసన ఉద్యమం ప్రారంభించిందన్నారు. నేడు దేశవ్యాప్తంగా తిరిగి ఉద్యమానికి ఉత్తేజం తీసుకురావటానికి అన్ని రాష్ట్రాల్లో ఎస్‌కేఎం ఈ సదస్సులు నిర్వహిస్తుందని తెలిపారు.

అక్టోబరు 3న లఖింపూర్‌లో జరిగిన ఘటను నిరసనగా దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. నవంబరు 26-28 తేదీలలో రాష్ట్ర కేంద్రాల్లో నిరవధిక ధర్నాలు నిర్వహించాలన్నారు. నరేంద్ర మోదీని గద్దె దించండి... కార్పొరేట్ శక్తులను పారద్రోలండి, దేశాన్ని రక్షించండి-వ్యవసాయాన్ని కాపాడండి అనే నినాదాలతో దేశ వ్యాప్తంగా రైతులు, కార్మికులు ఐక్య ఆందోళనకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. హసన్ మొల్ల మాట్లాడుతూ చనిపోయిన రైతు బిడ్డలకు నష్టపరిహారం చెల్లించాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, లఖింపూర్ ఘటనలో నలుగురు రైతులను పొట్టనపెట్టుకున్న హోం మంత్రి, ఆయన కుమారుడిని శిక్షించాలని, రైతులకు మద్దతు ధరల కోసం సి2+50ని అమలు చేయాలని, కేరళ తరహా రుణ విమోచనను దేశవ్యాప్తంగా చట్టబద్ధ హక్కుగా కల్పించాలని డిమాండ్ చేశారు. వీటి కోసం దేశవ్యాప్తంగా జరిగే ఉద్యమంలో రైతులంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.





Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.